తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 23.10.2026 | సంపుటి : 13 సంచిక : 93 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698






## ఇన్‌స్టాలోకి సోనియా..

**తొలి పోస్ట్‌తో ఆత్మకథ ఫస్ట్ లుక్ విడుదల**

**తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' తొలి ప్రతులను విడుదల చేసిన కాంగ్రెస్ అగ్రనేత**

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో అధికారికంగా అడుగు పెట్టారు. వచ్చే నెల విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఫస్ట్‌లుక్‌ను సోనియా గాంధీ తొలి పోస్టుగా పెట్టారు. పుస్తకం తొలి ప్రతులను అందుకుంటున్న దృశ్యాలతో కూడిన వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ప్రేమ, విధి నిర్వహణ, నష్టాలు, తనకు తగిన స్థానాన్ని కనుగొనే అన్వేషణ వంటి అంశాలు ఇందులో ఉంటాయని వివరించారు. పుస్తకం తొలి ప్రతులను అందుకున్న సందర్భంగా కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి స్వీట్లు పంచుకున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. తన జీవితంలోని

మిగతా 2లో..

## ముదిరాజ్‌లను బీసీఏలోకి చేర్చే అంశంపై

# చర్చిస్తాం



## భూస్వాములు, జమీందార్లపై పోరాటం చేసిన వ్యక్తి పండుగ సాయన్న ముదిరాజ్

**ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలు నిర్మిస్తాం. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటున్నాం. అందెశ్రీ, గద్దర్‌కు అండగా నిలిచాం. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజ్‌లదే. గతంలో నాకు వారు చేసిన సాయం ఎప్పటికీ గుర్తుంచుకుంటా. వారికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం వచ్చాక ముదిరాజ్ బిడ్డలకు అనేక అవకాశాలు కల్పించాం. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మంత్రి వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించా. మిగతా ముదిరాజ్ నేతలకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయి.**

**- సీఎం రేవంత్ రెడ్డి**

- ఆయన తన పోరాటంతో ఎందరికో ఆదర్శంగా నిలిచారు
- దొరలు ఆక్రమించిన భూములను పేదలకు పంచిపెట్టారు
- పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తాం
- చరిత్ర పుటల్లో ఆయనకూ ఓ పేజీ ఉండాలి
- జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం
- ఏడాదిలోనే ప్రక్రియ పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం
- వందేళ్లలో ఎవరూ చేయని పని తమ ప్రజా ప్రభుత్వం చేసింది:సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): నిజాం పాలనలో భూస్వాములు, దొరలు పేదల భూములను ఆక్రమిస్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పండుగ సాయన్న అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా సాయన్న నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు ధాన్యం పంచడంతో పాటు పేద ఆడబిడ్డలు వివాహాలకు ఆర్థిక సాయం చేసిన ఘనత సాయన్నదని కొనియాడారు. అన్యాయంగా హత్యకు గురైనప్పటికీ వందేళ్లు దాటినా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని సీఎం అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు.

**ప్రభుత్వంలో ముదిరాజ్‌లకు భాగస్వామ్యం**

బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం చేపట్టిందని రేవంత్ రెడ్డి చెప్పారు. కులగణన కారణంగానే వివిధ కులాలు తమ జనాభా, హక్కులపై బలంగా గళం వినిపిస్తున్నాయని తెలిపారు. లెక్కల్లో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి వివరాలు అందిస్తే సవరిస్తామని స్పష్టం చేశారు. ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని సీఎం

మిగతా 2లో..

## డిండికి నీటి తరలింపును

# ఆపండి



**ఏదుల నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నీరు తీసుకోవాలి**

**మంత్రి ఉత్తమ్‌కు పాలమూరు జిల్లా నేతల విజ్ఞప్తి**

- ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని వినతి
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాన్న నీటిపారుదల మంత్రి



హైదరాబాద్(జనంసాక్షి): ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాలమూరు జిల్లా నేతలు భేటీ అయ్యారు. డిండికి ఏదుల నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నీరు తీసు కోవాలని నేతలు కోరారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో ఇవాళ కీలక పరి ణామం చోటు చేసుకుంది. పాలమూరు నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపును ఆపాలని జిల్లా ప్రతినిధులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ మంత్రిని కోరినట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజా ప్రతినిధులు

మిగతా 2లో..

## దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ భేటీ



- ఐసీసీసీలో డిజిపిలు, ఐజిల సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల కట్టడిపై చర్చ
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ, ఉమ్మడి సహకారం, కార్యాచరణపై సమీక్ష

2లో..

## రామాలయ విరాళాల చోరీ..

# మోదీ మౌనమేలా?

**ఈ పాపంలో ఎందుకు భాగమయ్యారు**

- ఇన్ని రోజులు గడిచినా ఆ విషయంపై నోరువిప్పరెందుకు?
- సేకరించిన వేలకోట్ల విరాళాలు లూటీ అయ్యాయి
- విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు
- దొంగలను శిక్షించాల్సిన బాధ్యత దేశ పౌరులపైనే ఉంది : కాంగ్రెస్



న్యూఢిల్లీ(జనంసాక్షి): రామమందిర విరాళాల చోరీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. 'బీజేపీ, ఆరెఎస్ఎస్ వీహెచ్‌పీ కా సప్నా, చందే కా మాల్ అప్నా' అని ఎద్దేవా చేసింది. ఆలయ విరాళాల చోరీ జరిగి ఇన్ని రోజులు గడిచినా ఈ విష యంపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని, ఈ పాపంలో ఎందుకు భాగ స్వాములయ్యారని ప్రశ్నించింది. రామమందిరంలో సమర్పించిన కానుకలు మాత్రమే చోరీకి గురికాలేదని, ఆలయ నిర్మాణం కోసం కోట్ల మందినుంచి సేకరించిన వేల కోట్ల రూపాయల విరాళాలు కూడా లూటీ అయ్యాయని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతిపక్షాలు పదేపదే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లకు చెందిన వ్యక్తులపై ఆరోపణలు వచ్చినప్పటికీ, వారిపై ఇప్పటివరకూ ఎటువంటి విచారణ జరగలేదు. తప్పు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

మిగతా 2లో..

## ఢిల్లీలో నిరసనలు జరుగుతున్నాయి..

# రాహుల్ విదేశాల్లో ఉన్నారు



**ఇలాగైతే 30ఏళ్ల వరకు మీకు అధికారం రాదు**

**అమిత్‌షా జోస్యం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు. "మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి ఢిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. " గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును

మిగతా 2లో..

## ఎల్‌నినో వచ్చినా..

**రోజువారీ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి**

# విద్యుత్ కొరత రావొద్దు



**యాదాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లకు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా**

**విద్యుత్ బకాయిల పరిష్కారానికి వెసులుబాటు కల్పించేలా డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు**

**థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి

మిగతా 2లో..



## సీజేపీ నేతలకు పోలీసుల సమన్లు

**నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాలను ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు పిలిచింది. రూ.50 వేల చొప్పున వ్యక్తిగత, పూచీకత్తు బాండ్లు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాలను ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ గురువారం విచారణకు పిలిచింది. వారిని రాజౌరీ గార్డెన్ లోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి హాజరు కావాలని

మిగతా 2లో..

## మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే

# 'అలయ్ బలయ్'

**కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతమైన వేదిక**



- సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవాలి:వెంకయ్యనాయుడు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

హైదరాబాద్(జనంసాక్షి): నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వేదికగా అలయ్ బలయ్ దసరా సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. భారతీయ సాంస్కృతిక ఔన్నత్య పునరుద్ధరణ యజ్ఞంలో భాగంగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మధ్య ఏకాత్మతాభావం నెలకొల్పే లక్ష్యంతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించారు. నషా ముక్త్ భారత్ లక్ష్యంతో నిర్వహించిన ఆలయ్ బలయ్ సమ్మేళనానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు వీహెచ్, కె.కేశవరావు, జానారెడ్డితో పాటు బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు హాజరయ్యారు. బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉదయం 11 గంటలకు శమీ పూజతో అలయ్ బలయ్ ప్రారంభం కాగా అంతకు ముందు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలైన ఆత్మీయుల అలయ్ బలయ్ ఆలింగనాలు, షడ్రుచుల సమ్మేళనం, ఒగ్గుడోలు తాళాల మోత, జొన్నకర్రల జోరు,

మిగతా 2లో..



## డిసెంబర్‌లో తెలంగాణకు మోదీ

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- వరంగల్ రైల్వే మ్యాన్ ఫ్యాక్టరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం చేయడానికి డిసెంబర్‌లో ప్రధాని

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ స్పష్టం చేసింది. వరంగల్‌లో రైల్వే మ్యాన్ ఫ్యాక్చురింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను జాతికి అంకితం

మిగతా 2లో..

## సర్టిఫికెట్ కావాలంటే

# 75% మార్కులు దాటాల్సిందే!



**డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త నిబంధనలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి): డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు సంబంధించి కేంద్రం కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కోసం నిర్వహించే ఆన్‌లైన్ అసెస్‌మెంట్ పరీక్ష పాస్ మార్కులను 60 శాతం

మిగతా 2లో..

# మచ్చర్‌తో కలిసి రండి

## ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం



టెల్‌అవీవ్(జనంసాక్షి): ప్రధాని మోదీతో ఫోన్‌లో ఇజ్రాయెల్ ప్రధాని మాట్లాడారు. కెప్టెన్‌స్మిత్ మచ్చర్‌తో కలిసి స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. భారత్‌తో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని మోదీని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆహ్వానించారు. భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో జ్యోతి వెలిగించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రధాని

మిగతా 2లో..

## ఫ్రాన్స్‌లో మిన్నంటిన ఆందోళనలు

# జాగ్రత్తగా ఉండండి

**భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ**



న్యూఢిల్లీ(జనంసాక్షి): మౌలిక వసతుల లేమి, పెరుగుతున్న ధరల వంటి సమస్యలతో ఫ్రాన్స్ మండిపోడుతోంది. ఈ అశాంతియుత పరిస్థితులు, స్థానికంగా కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్‌లోని భారత ఎంబసీ హెచ్చరించింది. ఫ్రాన్స్‌లో నివసిస్తున్న, ఆ దేశం వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు సూచనలు చేసింది. "నిరసన ప్రదేశాలు, జనాలు భారీగా గుమిగూడిన ప్రాంతాలకు వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వాలు ఇచ్చే అధికారిక అడ్వైజరీలను గమనించుకోండి. రవాణాకు సంబంధించిన వివరాలను

మిగతా 2లో..

# జలమండలిలో సమ్మెలపై మరో ఆరు నెలల నిషేధం

- ఎస్మా చట్టం కింద ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- అక్టోబర్ 21 నుంచి అమల్లోకి..

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ)లో సమ్మెలపై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలపాటు పొడిగించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తాగునీటి సరఫరా, పంపిణీ సేవలకు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా)-1971లోని సెక్షన్ 3(1) ప్రకారం సమ్మెలను నిషేధిస్తూ గురువారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు.గత నిషేధం ముగియడంతో పొడిగింపు..జలమండలిలో సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం గతంలో ఏప్రిల్ 2న ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 21 నుంచి అమల్లోకి వచ్చిన ఆరు నెలల నిషేధం అక్టోబర్ 20తో ముగిసింది. ఈ నేపథ్యంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సెప్టెంబర్ 29న ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం మరో ఆరు నెలలపాటు సమ్మెలపై నిషేధాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం అక్టోబర్ 21, 2026 నుంచి తదుపరి ఆరు నెలలపాటు, అంటే 2027 ఏప్రిల్ 20 వరకు నిషేధం అమల్లో ఉండనుంది.అత్యవసర సేవల పరిధిలో నీటి సరఫరా..తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం-1971లోని సెక్షన్ 2(1)(ఏ)(త) ప్రకారం నీటి సరఫరా, పంపిణీ నిర్వహణ అత్యవసర సేవల పరిధిలోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2016 జూన్ 1న జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 45 ద్వారా తెలంగాణకు అన్వయించిన చట్ట నిబంధనల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ నిషేధం జలమండలిలో నీటి సరఫరా, పంపిణీ నిర్వహణతో సంబంధం ఉన్న అన్ని సేవలకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడించింది. సంబంధిత నోటిఫికేషన్‌ను తెలంగాణ అసాధారణ గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించింది. ఉత్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌కు ప్రభుత్వం సూచించింది.

## మోదీ మౌనమేలా?

మరోవిషయం ఏమిటంటే, కానుకలు సమర్పించకముందే విరాళాలు చోరీకి గురయ్యాయా? అనేది అసలు ప్రశ్న. ఇక, గతంలో అనుమానస్పదంగా జరిగిన భూములు కొనుగోళ్లపై కూడా ఎలాంటి స్పందన లేదు. 2021 మార్చి 18 సాయంత్రం 7:10 గంటలకు తివారీ, అన్సారీలు కుసుమ్ పాఠక్ అనే వ్యక్తి నుంచి రూ. 2 కోట్లకు భూమిని కొనుగోలు చేశారు. సరిగ్గా ఐదు నిమిషాల తర్వాత, అంటే సాయంత్రం 7:15 గంటలకు, అదే భూమిని ట్రస్టు తరపున చంపత్ రాయ్ రూ. 18.5 కోట్లకు కొనుగోలు చేశారు. ఇది నిజం కాదా? కేవలం అయిదు నిమిషాల వ్యవధిలో 825 శాతం ధర పెంచడమనేది స్పష్టమైన దోపిడీ. అసలు ఇది ఎలా సాధ్యమైంది? ఈ రెండు రిజిస్ట్రేషన్ పత్రాలకు సాక్షులుగా అప్పటి బీజేపీ మేయర్ రిషికేష్ ఉపాధ్యాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రానే ఉన్నారు."అని అన్నారు

## మచ్చర్‌తో కలిసి రండి

మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం నెతన్యాహు గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలను మోదీ ప్రశంసించినట్లు తెలిపారు.భారత ప్రధాని మోదీతో మాట్లాడటం సంతోషంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి వెలిగించాలని మోదీని ఆహ్వానించినట్లు వివరించారు. ఈ ఆహ్వానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారని నెతన్యాహు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. భూమిపై మాత్రమే కాకుండా గగనతలంలోనూ ఇరు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని మోదీ అభిప్రాయపడినట్లు నెతన్యాహు తన పోస్టులో వివరించారు.

## ఫ్రాన్స్‌లో మిన్నంటిన ఆందోళనలు

తమ దేశంలో జరుగుతోన్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ఖండించారు రాజకీయ లబ్ధికోసమే విదేశీ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు..

**ఢిల్లీలో నిరసనలు జరుగుతున్నాయి..**

## రాహుల్ విదేశాల్లో ఉన్నారు

ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు. "రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చే అంశంపై చర్చిస్తాం

వెల్లడించారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ఇతర కులాల్లో ఉన్న అపోహలను కూడా తొలగించాల్సి ఉందన్నారు. గతంలో శ్రీహరి ముదిరాజ్‌కు డీసీసీ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశామని నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.
సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం
ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచించారు. ప్రభుత్వంలో ముదిరాజులను భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మరోవైపు, గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరింత విస్తృతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 3.48 కోట్ల



మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. బీసీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి అధ్యయనం చేయిస్తామన్నారు. ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.వందేళ్లలో ఎవరూ చేయని పని తమ ప్రభుత్వం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని పునరుద్ఘాటించారు.
పేదల పక్షాన నిలబడి, దొరల దోపిడీని ఎదిరించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని ప్రకటించారు. వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.

# దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ భేటీ

- ఐసీసీసీలో డిజిపిలు, ఐజిల సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల కట్టడిపై చర్చ
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ, ఉమ్మడి సహకారం, కార్యాచరణపై సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):**
దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) నిర్వహిస్తున్నట్లు డిజిపి సి. వి.ఆనంద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డిజిపిలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో, సి బి ఐ, డిపార్ట్మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, సిఆర్పిఎఫ్ సంస్థల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, పరస్పర సహకారం, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ప్రధాన అంశాలపై చర్చ ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలు సమావేశం ఎజెండాలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచే మార్గాలపై సమీక్షించనున్నారు.దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వంటి అంశాలపైనా విస్తృతంగా చర్చించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థంగా అరికట్టవచ్చన్న లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

# ఇన్‌స్టాలోకి సోనియా..

ప్రచురణ సంస్థ మార్పుతో వివాదం
సోనియా గాంధీ ఆత్మకథ భారత ప్రచురణ హక్కులను హార్పర్‌కాలిన్స్ ఇండియా దక్కించుకుంది. నవంబర్ 10న దేశీయ మార్కెట్‌లో ఈ పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు గత నెలలో ప్రకటించింది. ఈ పుస్తకం ప్రచురణ వ్యవహారం గతంలో వివాదానికి దారితీసింది. తొలుత ఆత్మకథను ప్రచురించేందుకు ముందుకొచ్చిన పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా, చివరకు ఆ బాధ్యత నుంచి తప్పుకుంది. మాన్యుస్క్రిప్ట్‌లో సంపాదకీయ మార్పుల విషయంలో ప్రచురణ సంస్థకు, రచయిత ప్రతినిధులకు మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు కొందరు ప్రభుత్వ ఒత్తిడి, భావప్రకటనా స్వేచ్ఛ అంశాలను లేవనెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), మోదీ ప్రభుత్వ హయాంలో చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిందనే అంశాలకు సంబంధించిన కొన్ని భాగాలను తొలగించేందుకు పెంగ్విన్‌పై ఒత్తిడి వచ్చిందని కొందరు ఆరోపించారు.
అయితే, ఈ ఆరోపణలను పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ధ్రువీకరించలేదు. పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఎంతో ఆసక్తి చూపామని, దాన్ని సాధించడం కోసం గణనీయమైన ప్రయత్నాలు చేశామని సంస్థ పీటీఐకి తెలిపింది. అయినప్పటికీ, ఓ నిర్దిష్ట అంశంపై ప్రతిష్ఠంభన ఏర్పడటంతో ప్రచురణ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరించింది. ఈ నిర్ణయం వెనక ఎలాంటి బయటి ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. అయితే, రచయితతో కుదుర్చుకున్న ఒప్పందం, గోప్యతా నిబంధనల కారణంగా విభేదాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేమని పేర్కొంది. అనంతరం హార్పర్‌కాలిన్స్ ఇండియా పుస్తక ప్రచురణ బాధ్యతలు చేపట్టడంతో అనిశ్చితికి తెరపడింది.
ఇటలీలో బాల్యం నుంచి భారత రాజకీయాల వరకుసోనియా ఆత్మకథ ఆమె బాల్యంతో ప్రారంభమవుతుంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో ఇటలీలోని వెనెటో ప్రాంతంలో గడిపిన రోజులను ఇందులో వివరించారు. అనంతరం విద్యాభ్యాసం కోసం కేంబ్రిడ్జ్‌కు వెళ్లిన ఆమె.. 1965లో అక్కడే రాజీవ్ గాంధీని కలిశారు. రాజీవ్ గాంధీ భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మనవడు. ఆ పరిచయం వివాహ బంధంగా మారిన తర్వాత భారతదేశంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన అనుభవాలను కూడా పుస్తకంలో ప్రస్తావించారు. అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పరిచయం, భారతీయ జీవనశైలికి అలవాటుపడటం, హిందీ నేర్చుకోవడం, చీరలు ధరించడం, భారతీయ ఆహారపు అలవా ట్లు, సంస్కృతిని అర్థం చేసుకోవడం వంటి అంశాలు వివరించారు.

# సర్టిఫికెట్ కావాలంటే 75% మార్కులు దాటాల్సిందే!

నుంచి 75 శాతానికి పెంచింది. డ్రైవింగ్‌పై అవగాహన కోసం నిర్వహించే ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు సాగాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. భాగస్వామ్యపక్షాల నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. పేరు, చిరునామా వివరాల మార్పు కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 15 రోజుల్లోగా ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలి. ఒకవేళ తిరస్కరిస్తే తగిన కారణం తెలపాల్సి ఉంటుంది. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. ఆధార్ అథంటికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే కొన్ని డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వా లని భావిస్తున్నారు. పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాల మార్పులకూ ఛార్జీలు తొలగించనున్నారు .గుర్తింపు, వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రా లు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఇ-రేషన్ కార్డు, గడిచిన 3 నెలల్లోపు వచ్చిన విద్యుత్, గ్యాస్ బిల్లులను అనుమతి స్తారు. చిరునామా ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఎల్ఐసీ పాలసీలను తొలగించాలని ముసాయిదా పే ర్కొంది. అలాగే, కొత్తగా జారీ చేసే డ్రైవింగ్ లైసె న్సులు, రెన్యువల్ లైసెన్సులను లేమినేటెడ్ లేదా పీవీసీ కార్డు రూపంలో జారీ చేయాలని ముసాయిదాలో కేంద్రం పేర్కొంది.

# డిసెంబర్‌లో తెలంగాణకు మోదీ

చేయనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ఫోకస్ చేసినట్లుగా కనిపిస్తోంది.హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావులు పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నేతలు కూడా ఉన్నారు.ముఖ్యనేతల సమావేశంలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనుంది. సర్‌పై కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు చేస్తున్న రాద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి, గుంపు సామ్యాన్ని ఓడించండి" అంటూ తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు పిలుపునిచ్చారు. దేశాన్ని బీజేపీ మాత్రమే రక్షిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

# డిండికి నీటి తరలింపును ఆపండి

తెలిపారు. ఏదుల నుంచి డిండికి నీటిని తరలించే అంశాన్ని చర్చించినట్లు చెప్పారు. ఈ అంశంపై అధికారులతో చర్చించి అన్ని ప్రాంతాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఉమ్మడి పాలమూరు ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

**గంటన్నర పాటు చర్చలు**

డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపు అంశం పాలమూరు జిల్లా నేతల్లో గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెంది మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఆ జిల్లా ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్‌లోని ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. దాదాపు గంటన్నరపాటు ఉత్తమ్ కుమార్ రెడ్డితో జరిగిన సమావేశంలో డిండి నీటి తరలింపుతో పాటు పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులపైనా చర్చించారు.ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని విజ్ఞప్తి ఏదుల నుంచి డిండికి నీటిని తరలిస్తే పాలమూరు ప్రాంతంలోని ఆయకట్టుకు నీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే డిండి ప్రాజెక్టుకు నీటిని అందించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, పాలమూరు రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటిని తరలించాలని కోరినట్లు తెలిపారు.

**ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం**

ఏదుల నుంచి కాకుండా మరో ప్రత్యామ్నాయ నీటి వనరు ద్వారా డిండికి నీటిని తరలించే అవకాశాలను పరిశీలించాలని నేతలు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏదుల నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తే ఎగువ ప్రాంతాల్లోని పాలమూరు ఆయకట్టుకు నీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. డిండి ప్రాజెక్టుకు నీరు ఇవ్వాలన్న అంశంలో తమకు అభ్యంతరం లేదని అయితే పాలమూరు ప్రాంత ప్రయోజనాలకు భంగం కలగకుండా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అధికారులతో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చినట్లు సమాచారం.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ ప్రయోజనాలకు అన్యాయం చేయరనే నమ్మకం తమకు ఉందని జూపల్లి అన్నారు. పాలమూరు ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరలో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే 'అలయ్ బలయ్'

జమిడిక వాద్యాల హోరు, ఆడబిడ్డల కోలాటాలు, బతుకమ్మ, బోనాలు, గొబ్బెమ్మలు, గౌరమ్మలు, భజన కీర్తనలు, ఢమరుక నాదాలు, డప్పు విన్యాసాలు, చిందు యక్షగానాలు, ఒగ్గు కథలు, సన్నాయి వాద్యాలు ఆలయ్ బలయ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతమైన వేదిక మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే అలయ్ బలయ్ అని వెంకయ్యనాయుడు తెలిపారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆలోచనకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో మనందరి లక్ష్యం కావాలన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ అనేది కులమతాలకు రాజకీయాలకు ప్రాంతాలకు అతీతమైన వేదికన్నారు. ఆలయ్ బలయ్‌లో తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు, వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.దసరా వచ్చిందంటే మనకు గుర్తుకు వచ్చేది అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సెక్యులర్ దేశంలో ఏ మతాన్ని, ఏ పండగను తక్కువ చేసి చూడకూడదని హితవు పలికారు.

**సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవాలి**

పంజాబ్ ప్రజల తరపున, తన తరుపున దత్తాత్రేయకు అభినందనలు తెలుపుతున్నట్లు పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా తెలిపారు. 2005 నుంచి అలయ్ బలయ్?ను విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. 'నషా ముక్తి భారత్' అనేది మన ముందున్న లక్ష్యమన్నారు. పంజాబ్?లో అది తన బాధ్యత అని చెప్పారు. తెలంగాణలో బతుకమ్మ, బోనాలు ఎంతో విశిష్టమైన పండగలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకుంటూ జరుపుకునే పండగలని కొనియాడారు. విజయదశమి మరుసటి రోజు అలయ్ బలయ్ నిర్వహించి వివిధ మనస్తత్వాలు ఉన్న మనుషులను ఏకతాటిపైకి మామూలు విషయం కాదన్నారు.కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా అలయ్ బలయ్ జరుపుకుంటున్నామని మాజీమంత్రి జానారెడ్డి తెలిపారు. అలయ్ బలయ్ నిర్వహిస్తున్న బండారు దత్తాత్రేయకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ వేదిక కాదు.. సిద్ధాంతాల వేదిక కాదు.. మానవత్వాన్ని పెంచే వేదిక అలయ్ బలయ్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. అందరం కలిసి ఉంటేనే దేశం ముందుకు వెళ్తుందన్నారు. చెడు పైన మంచి సాధించడం అనే ఉద్దేశ్యంతో దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారన్నారు.

# ఎల్‌నినో వచ్చినా.. విద్యుత్ కొరత రావొద్దు

పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధా నించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. "టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024-25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి" జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశంతెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్,టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీలను డిప్యూటి సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిలచెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పిడిసిఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# సీజేపీ నేతలకు పోలీసుల సమన్లు

ఆదేశించింది. జంతర్ మంతర్ వద్ద నిరసనకు సంబంధించిన కేసులో వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరిద్దరిని జ్యుడిషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు బుధవారం ఆదేశించింది. శాంతిభద్రతలకు భంగం కలిగించబోమని, చట్టాన్ని పాటిస్తామని నాయకులు లిఖితపూర్వక హామీ ఇచ్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. వారి వ్యక్తిగత బాండ్లు, పూచీకత్తు పత్రాలను స్వీకరించిన అనంతరం విడుదలకు ఆదేశాలు జారీ చేసింది.

**రూ.50 వేల చొప్పున బాండ్లు**

విచారణ పూర్తయ్యే వరకు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున వ్యక్తిగత, పూచీకత్తు బాండ్లను సమర్పించాలని ఎస్ఈఎం రితు రాజ్ ఆదేశించారు. కేసు విచారణకు సంబంధించిన ప్రతి తేదీన కోర్టుకు హాజరు కావాలని స్పష్టం చేశారు. బాండ్లు, హామీ పత్రాల్లో పేర్కొన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కోర్టుకు సమర్పించిన లిఖితపూర్వక హామీల్లో తాము శాంతికి భంగం కలిగించబోమని, ప్రజా ప్రశాంతతకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోమని ఇద్దరు నాయకులు పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలకు సంబంధించి కూడా హామీ ఇచ్చారు. చట్టప్రకారం ఆ ప్రాంతాన్ని నిరసనల కోసం అనుమతించే వరకు అక్కడ ఆందోళనలకు పిలుపునివ్వబోమని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే నిరసనలను రాజ్యాంగ పరిధిలోనే చేపడతామని స్పష్టం చేశారు. ఈ హామీలను పరిగణనలోకి తీసుకున్న ఎస్ఈఎం కోర్టు, ఈ దశలో మరింతకాలం జ్యుడిషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరం కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. అందుకే వారిని విడుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపింది.

**అక్టోబర్ 23న తదుపరి విచారణ**

ఈ కేసులో తదుపరి విచారణను అక్టోబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు కోర్టు జాబితా చేసింది. ఆ రోజున సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాతో పాటు వారి పూచీదారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించింది. పూచీదారులకు సంబంధించిన ధ్రువీకరణ నివేదికను తదుపరి విచారణ సందర్భంగా సమర్పించాలని దర్యాప్తు అధికారికి సూచించింది. కేసు విచారణ చట్టప్రకారం కొనసాగుతుందని ఎస్ఈఎం కోర్టు స్పష్టం చేసింది. నాయకులకు విడుదల మంజూరు చేసినప్పటికీ, కేసు విచారణ ముగిసినట్లు కాదని పేర్కొంది.

# సిమ్ బైండింగ్‌రూల్స్..

జనవరి 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ(జనంసాక్షి):వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్సనకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స ఫోన్‌లో పనిచేయవన్నమాట. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లు రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించే లైవ్ సిమ్‌లతో ఖాతాలను అనుసంధానించాలని టెలికాం విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. మొబైల్ నంబర్లను ఉపయోగించి చేసే సైబర్ నేరాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిబంధనలు కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి నుంచే ఈ రూల్స్‌ను అమలు చేయాల్సి ఉండగా.. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించింది.సిమ్ బైండింగ్ నిబంధనల ప్రకారం.. సిమ్‌కార్డు లేకపోయిన లేదా సిమ్ తొలగించినా వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి కమ్యూనికేషన్ యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి.

# ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి.. విగతజీవిగా ఇంటికి చేరి..

- ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చొరవతో ఆదిత్య మృతదేహం స్వగ్రామానికి రాక..
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు.



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 22, (జనంసాక్షి) :** కుటుంబానికి అండగా నిలవాలని, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎన్నో ఆశలతో విదేశాలకు వెళ్లిన ఆ యువకుడు.. చివరకు విగతజీవిగా స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకున్న ఆ యువకుడి జీవితం అర్ధంతరంగా ముగియడంతో సోన్ మండలం మాదాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. గ్రామానికి చెందిన తోకల తిరుపతి, పద్మ దంపతుల పెద్ద కుమారుడు ఆదిత్య ఐదు నెలల క్రితం ఉపాధి నిమిత్తం టర్కీ దేశానికి వెళ్లాడు. అక్కడ భవన నిర్మాణ పనులు చేస్తుండగా సెప్టెంబర్ 14న ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురై, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని సంప్రదించగా అక్కడి అధికారులతో సంప్రదింపులు జరిపి వైద్య సహాయం అందేలా ప్రయత్నించారు. అయితే, మృత్యువుతో పోరాడిన ఆదిత్య అక్టోబర్ 15న చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఆదిత్య మృతదేహాన్ని స్వగ్రామా నికి తీసుకురావడానికి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి విదేశాంగ మంత్రిత్వ శాఖతో సంప్రదిం పులు జరిపి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ కృషితో ఆదిత్య మృతదేహం గురువారం మాదాపూర్ గ్రామానికి చేరుకుంది. బిడ్డ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించిన తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. ఉపాధి కోసం పరాయి దేశానికి వెళ్లిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



# జర్నలిస్టులను హింసించిన పోలీసులు!

- గంభీరావుపేట ఘటనపై నిజ నిర్ధారణ కమిటీ నివేదిక
- ఎస్సై, కానిస్టేబుల్ ను సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్

**కరీంనగర్ (జనంసాక్షి) :** పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ గురువారం రోజున ఫోన్ న్యూస్ ఛానల్ కు చెందిన ఇద్దరు జర్నలిస్టులను గంభీరావుపేట పోలీసులు హింసించిన ఘటనపై నిజనిర్ధారణ కమిటీ నిర్వహించింది. కరీంనగర్ వన్ టౌన్ పోలీసులను, సిపిని కలిసి వివరాలు సేకరించారు. ఈ మేరకు జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తేలింది. అయితే జర్నలిస్టులు రాసిన రాతలు అసభ్యకరంగా ఉంటే చట్టపరంగా చర్యలు చేపట్టాలి గాని థర్డ్ డిగ్రీ ప్రయోగించడం చట్టరీత్యా నేరమని పౌర హక్కుల సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. అరెస్టు వారెంట్ జారీ చేయకుండా పోలీసులు నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ సందర్భంగా పలువులు పావురాకుల సంఘం నేతలు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల మీద జర్నలిస్టుల మీద పోలీసులు హింసను మానుకోవాలని డిమాండ్ చేశారు. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ను సర్వీస్ నుంచి తొలగించాలని, ఈ ఘటనపై స్వతంత్ర సంస్థ చేత దర్యాప్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధవ కుమారస్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్ చందర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బి రవి, ఉపాధ్యక్షుడు వినోద్, దళిత లిబరేషన్ ఫ్రంట్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, ప్రజా సంఘాల నాయకుడు సిహెచ్ చందు పాల్గొన్నారు.

# సాయన్న విగ్రహం ప్రతిష్టాపనకు భూమి పూజ



**పాలకుర్తి, అక్టోబరు 22 (జనంసాక్షి)** ముదిరాజుల కులస్తుల ఆరాధ్య దైవం, ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విగ్రహా ప్రతిష్టాపనకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల నాయకు డు మామిండ్ల సోమయ్య మాట్లాడుతూ భూస్వాములు, జమీందారులు. పెత్తం దారులపై పోరాటం చేసి గొప్ప నాయకుడు సాయన్న అని కొనియాడారు. సాయన్న ఎందరికో ఆదర్శంగా నిలిచారని అన్నారు. చరిత్రలో సాయన్నకు విశిష్ట స్థానముందని అన్నారు. ఆయన ముదిరాజుల కులస్తుల కోసం పోరాటం చేయలేదని, అన్ని వర్గాల బడుగు, బలహీనవర్గాల శ్రేయస్సు లక్ష్యంగా పోరాటం చేశాడని గుర్తు చేశాడు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్. జీడి నిరంజన్, వార్డు సభ్యుడు కత్తి దస్తగిరి, మామిండ్ల శోభన్ బాబు, దాసరి మధు, నాయకులు మామిండ్ల యాకయ్య, జీడి మనోహర్, సోమల్లు, రేగుల కృష్ణ పాల్గొన్నారు.

# ప్రజా సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత

- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రజా సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత.. ప్రజా సమస్యల పరిష్కారమే పాలకుల లక్ష్యమని , రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ముందు రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. గురువారం నాడు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి మంచిర్యాల శాసన సభ్యులు ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ...బ్రిడ్జి పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు, వాహనదారులకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ, నిర్మాణ పనుల సమయంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి) :** నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఫ్లోరింగ్, నిర్మాణ పనులతో పాటు ఇతర పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంలో బస్‌స్టాండ్ కీలకమని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిగిలిన పనులను సమన్వయంతో పూర్తి చేసి, బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా రంగాల కృషికి ప్రశంసలు

- అధ్యాపకులకు కేయూ వైస్-ఛాన్సలర్ అభినందనలు



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** సెప్టెంబర్ 25, 26 తేదీలలో చెన్నైలోని ఒక వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తమ పరిశోధనా పత్రాలను సమర్పించినందుకు, కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతికి, జర్నలిజం విభాగం అధ్యాపకుడు మరియు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్ఓ) డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డికి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ మాట్లాడుతూ, అధ్యాపకుల విద్యా, పరిశోధనా రంగాల కృషిని ప్రశంసించారు. అంతర్జాతీయ విద్యా వేదికలలో వారి భాగస్వామ్యం ఉన్నత విద్యలో శ్రేష్ఠత పట్ల వారి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అధ్యాపకులు కేవలం తరగతి గది బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు, విద్యా చర్చలు మరియు జ్ఞాన వ్యాప్తిలో కూడా చురుకుగా పాల్గొనాలని ఆయన ఉద్ఘాటించారు. పరిశోధన అనేది ఉన్నత విద్యకు ఒక ప్రాథమిక స్తంభమని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో, జ్ఞాన పరిధులను విస్తరించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వైస్-ఛాన్సలర్ గమనించారు. అంతర్జాతీయ సమావేశాలలో పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా అధ్యాపక సభ్యులకు వివిధ రంగాల పండితులతో ఆలోచనలను పంచుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న పరిశోధనా ధోరణులను అర్థం చేసుకోవడానికి, వారి వారి రంగాల అభివృద్ధికి దోహదపడటానికి విలువైన అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. అధ్యాపకులు మరియు విద్యార్థులలో బలమైన పరిశోధనా సంస్కృతిని ప్రోత్సహించాల్సిన ముఖ్యమైన బాధ్యత విశ్వవిద్యాలయాలకు ఉందని ఆయన ఇంకా పేర్కొన్నారు. ఆయన ప్రకారం, సమకాలీన సామాజిక, ఆర్థిక, శాస్త్రీయ, విద్యాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర పరిశోధన, విమర్శనాత్మక ఆలోచన, నూతన జ్ఞానాన్వేషణ చాలా అవసరం. వినూత్న పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని, నాణ్యమైన పరిశోధనా పత్రాలను ప్రచురించాలని మరియు విద్యా సమావేశాలు, సెమినార్లు మరియు వర్క్‌షాప్‌లలో చురుకుగా పాల్గొనాలని ఆయన అధ్యాపక సభ్యులను ప్రోత్సహించారు. అంతర్జాతీయ విద్యా వేదికపై కాకతీయ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించిన ప్రొఫెసర్ శంకరి జ్యోతి మరియు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డిల కృషిని ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి విజయాలు విశ్వవిద్యాలయం యొక్క విద్యా ప్రతిష్టను పెంచుతాయని మరియు ఇతర అధ్యాపక సభ్యులను, పరిశోధక పండితులను వారి విద్యా మరియు పరిశోధనా కార్యకలాపాలలో శ్రేష్ఠతను సాధించడానికి ప్రేరేపిస్తాయని ఆయన పేర్కొన్నారు. అధ్యాపక బృందం తమ పరిశోధనా ప్రయత్నాలను కొనసాగించి, బోధన, పరిశోధన, విద్యాభివృద్ధికి అందించే తోడ్పాటు ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపును తీసుకువస్తారని వైస్-ఛాన్సలర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపక బృందం సమర్థవంతమైన బోధనను, అర్థవంతమైన పరిశోధనను, విస్తృత విద్యా స్థాయిలలో జ్ఞాన వ్యాప్తిని మేళవించినప్పుడు విశ్వవిద్యాలయం ఎంతగానో ప్రయోజనం పొందుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ జితేందర్ మరియు హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు. వారు అధ్యాపక బృంద సభ్యుల విద్యాపరమైన సాధనను అభినందించారు.

# కుటుంబ తగాదాలతో ఒకరి మృతి



**చింతలమానే పల్లి అక్టోంబర్ 22(జనం సాక్షి) :** మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన నికాడే రవి (35) కుటుంబ తగాదాల నేపథ్యంలో బుధవారం రోజున పురుగుల మందు సేవించాడు గమనించిన . కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రోజున మృతి చెందాడు. మృతుడి తల్లి నికాడ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతలమానపల్లి ఎస్సై ఎం. కమలాకర్ తెలిపారు.

# కేటీఆర్‌ను కలిసిన ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దసరా పండగ సందర్భంగా బిఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మాజీ బీసీ కమిషన్ సభ్యులు హైకోర్టు న్యాయవాది ఉపేంద్ర మర్యాదపూర్వకంగా కలిసారు. దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి వారికి శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ పరాభవ సంవత్సరం నుండి ప్లవంగ నామ సంవత్సరం వరకు వారు చేపట్టబోయే అన్ని కార్యక్రమాలు జయప్రదం కావాలని కోరారు..

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి..

- కలెక్టర్ రాహుల్ శర్మ..

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నీరు విలువైన వనరు అని, తాగునీరు, సాగునీటిని వృథా చేయకుండా అవసరం మేరకే వాడాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. విద్యుత్ విషయంలో కూడా అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆపేసి పొదుపు పాటించాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రజల భాగస్వామ్యం కీలకమని, నీరు, విద్యుత్ పొదుపును సామాజిక బాధ్యతగా పాటించాలని కోరారు.

# సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 22(జనంసాక్షి) :** జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్లు, భవనాలు, నీటిపారుదల, పర్యాటక, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్, తదితర శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితి, పనులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను ఆయన క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించి, నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు రాబోయే ఆరు నెలలు అనుకూలంగా ఉంటాయని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అంచనాలను సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. పనుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించి, వాటికి అనుగుణంగా పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమీక్ష సమావేశం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఫోన్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వైద్య కళాశాల, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భవన నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో రహదారి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అంచనాల తయారీ, టెండర్ల ఖరారు, పనుల ప్రారంభంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత సాంకేతిక అధికారులు పనులను క్రమం తప్పకుండా పరిశీలించి, పురోగతి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా అధికారులు అప్పలనాయుడు, ధర్మానాయక్, భిక్షపతి, శ్యాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు

- క్వింటాల్‌కు రూ.9,260 వరకు ధర
- జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 కొనుగోలు కేంద్రాలు
- తేమ శాతం విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల అక్టోబర్ 23( జనం సాక్షి):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు మెరుగైన ధర పొందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించిన పత్తి కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తి తేమ శాతం పరీక్ష, తూకం ప్రక్రియను పరిశీలించి రైతులకు అందుతున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,667 కాగా, జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు ప్రస్తుతం రూ.9,260 వరకు ధర చెల్లిస్తూ పత్తిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌లో అత్యధిక ధర లభించడం రైతులకు ప్రయోజనకరమైన విషయమన్నారు. పత్తిలో తేమ శాతం అధికంగా ఉండకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తిని పూర్తిగా ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా నాణ్యతను కాపాడుకోవడంతో పాటు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో తేమ శాతం పరీక్షించే యంత్రాల వినియోగంపై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని యంత్రాల ద్వారా పారదర్శకంగా పరీక్షించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్‌యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు వేచి ఉండే సమయం తగ్గేలా తూకం, తేమ పరీక్ష, కొనుగోలు తదితర ప్రక్రియలను సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల కోసం 'రూపాయికే భోజనం' పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతు ప్రతినిధులతో స్థానిక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రానున్న రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంట వ్యర్థాలను కాల్చవద్దని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# మానవ హక్కుల హననంపై ఐరాస హెచ్చరిక!

భారతదేశంలో విద్యార్థులు, యువత నేతృత్వంలో జరుగుతున్న నిరసనలపై పోలీసులు సాగిస్తున్న అణచివేత చర్యల పట్ల ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణులు వ్యక్తం చేసిన తీవ్ర ఆందోళన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. శాంతియుత నిరసనలపై లాఠీఛార్జీలు, సామూహిక నిర్బంధాలు, లైంగిక వేధింపుల ఆరోపణలు, డిజిటల్ నిఘా, ఇంటర్నెట్ నిలిపివేతలు.. ఇవన్నీ విడివిడి ఘటనలుగా కొట్టిపారేయలేని తీవ్రమైన అంశాలు. ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే ఆ హక్కులను హరించే సాధనంగా మారుతోందన్న ఆందోళన ప్రజాస్వామ్య వాదులను కలవరపెడుతోంది.

*ఐరాస మానవ హక్కుల నిపుణులు లేవనెత్తిన అంశాల్లో అత్యంత కీలకమైనది శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుపై జరుగుతున్న దాడి. విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. అటువంటి నిరసనలను పోలీసు బలంతో అణచివేయడం, నిరాయుధులపై లాఠీలు ఝుళిపించడం, ముందస్తు నిర్బంధాలతో భయానక వాతావరణాన్ని సృష్టించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడానికి ప్రభుత్వాలకు ఎలాంటి మినహాయింపూ ఉండకూడదు.*

నిరసనల సమయంలో, నిర్బంధాల అనంతరం లైంగిక, లింగ ఆధారిత హింస చోటుచేసుకుందన్న నివేదికలపై ఐరాస నిపుణులు వ్యక్తం చేసిన ఆందోళన మరింత తీవ్రమైనది. ఈ ఆరోపణలను తేలికగా తీసుకోవడం బాధితుల హక్కులను నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. ఆరోపణలపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. చట్టాన్ని అమలు చేసే అధికారులే ఉల్లంఘనలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చినప్పుడు, వారిని విచారించే వ్యవస్థ కూడా స్వతంత్రంగా ఉండాలి. అధికార దుర్వినియోగానికి బాధ్యత వహించాల్సిన అవసరం ప్రజాస్వామ్యంలో తప్పనిసరి. ఏడువేల మందికి పైగా విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు, న్యాయవాదులను నిర్బంధించారన్న ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయ ప్రస్తావన కూడా ఆందోళనకరమైనది. ఈ సంఖ్య, నిర్బంధాల చట్టబద్ధతపై వచ్చిన ప్రశ్నలు ఎంత తీవ్రమైనవో సూచిస్తున్నాయి. నేరం చేసినట్లు నిర్ధారణ కాకముందే పౌరులను సామూహికంగా అదుపులోకి తీసుకోవడం న్యాయపాలన సూత్రాలకు విరుద్ధం. ముఖ్యంగా పాత్రికేయులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు నిజమైతే, అది వ్యక్తుల స్వేచ్ఛకే కాకుండా ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థకు, న్యాయ సహాయం పొందే హక్కుకు కూడా ముప్పుగా పరిణమిస్తుంది.

డిజిటల్ నిఘా, ఇంటర్నెట్ నిలిపివేతలపై ఐరాస నిపుణులు లేవనెత్తిన అభ్యంతరాలు ఆధునిక ప్రజాస్వామ్యాల్లో పౌర స్వేచ్ఛల పరిరక్షణ ఎంత కీలకమో గుర్తుచేస్తున్నాయి. నిరసనకారులపై బయోమెట్రిక్ సాంకేతికతలతో నిఘా పెట్టడం, నిరసనలు జరిగే ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ద్వారా ప్రజల సమాచార ప్రాప్తిని, పరస్పర సంబంధాలను, సంఘటితమయ్యే అవకాశాలను దెబ్బతీయవచ్చు. భద్రత పేరుతో అమలు చేసే చర్యలు అవసరమైనవా, చట్టబద్ధమైనవా, అనుపాతబద్ధమైనవా అన్నది పరిశీలించకుండా వాటిని సమర్థించడం సరికాదు.

ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో సుమారు 13 కోట్ల మంది పేర్లు తొలగించారన్న అంశాన్ని కూడా ఐరాస నిపుణులు ప్రస్తావించడం గమనార్హం. ఈ ప్రక్రియ ముస్లిం మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అసమాన ప్రభావం చూపుతోందన్న ఆందోళనలను వారు లేవనెత్తారు. ఈ గణాంకం, ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను సంబంధిత అధికార యంత్రాంగం పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరులు ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడితే అది ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా సామాజికంగా అణగారిన వర్గాల హక్కులకు భంగం కలగకుండా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యత.

భారతదేశం అంతర్జాతీయ మానవ హక్కుల బాధ్యతలకు కట్టుబడి ఉండాల్సిన దేశం. ఐరాస నిపుణులు లేవనెత్తిన అంశాలు కేవలం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠకు సంబంధించినవి మాత్రమే కావు; అవి దేశ పౌరుల రాజ్యాంగ హక్కులకు సంబంధించినవి. ఈ నేపథ్యంలో నిరసనకారులపై బలప్రయోగాన్ని నిలిపివేయడం, నిర్బంధాల చట్టబద్ధతను సమీక్షించడం, పోలీసుల చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం తక్షణ అవసరం. ఓటర్ల జాబితాలపై వచ్చిన ఆరోపణలకు కూడా పారదర్శకమైన సమాధానం ఇవ్వాలి.

ఐరాస మానవ హక్కుల నిపుణుల హెచ్చరికను ప్రభుత్వ వ్యతిరేకతగా చిత్రీకరించడం లేదా రాజకీయ వివాదంగా కుదించడం సమస్య తీవ్రతను తగ్గించదు. అంతర్జాతీయ నిపుణులు లేవనెత్తిన ప్రతి ఆరోపణను ఆధారాలతో పరిశీలించి, తప్పులు జరిగితే సరిదిద్దడం, హక్కుల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే బాధ్యులను జవాబుదారీ చేయడం ప్రభుత్వ బాధ్యత. ప్రజాస్వామ్య బలం అసమ్మతిని అణచివేయడంలో కాదు; అసమ్మతిని సహించే సామర్థ్యంలో ఉంటుంది. విద్యార్థులపై లాఠీలు, పౌరులపై నిఘా, నిరసనలపై నిర్బంధాలు, సమాచారంపై ఆంక్షలు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచాలు కావు. అవి హక్కుల పరిరక్షణకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతాయి. లిఐరాస నిపుణుల హెచ్చరికను సీరియస్‌గా తీసుకొని, మానవ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టడమే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం.

# బ్యాంకు డేటా లీక్.. ప్రజల భద్రతకు ఎవరు బాధ్యులు?




ప్రజలు తమ కష్టార్జిత సొమ్మును భద్రపరుచుకోవడానికి బ్యాంకులను ఆశ్రయిస్తారు. తమ వ్యక్తిగత వివరాలను, ఆర్థిక సమాచారాన్ని నమ్మకంతో అప్పగిస్తారు. కానీ ఆ సమాచారమే సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళితే, ఆ నమ్మకానికి రక్షణ ఎక్కడ? దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినియోగదారుల సమాచారం లీక్ అయిందన్న వార్త ఈ ప్రశ్నను తీవ్రంగా ముందుకు తెచ్చింది. డిజిటల్ బ్యాంకింగ్‌ను విస్తరిస్తున్న సంస్థలు, ప్రజల డేటాను కాపాడటంలో విఫలమైతే, ఆ వైఫల్యానికి మూల్యం చెల్లించాల్సింది సామాన్య వినియోగదారులేనా? సాంకేతిక అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకోవడం కాదు, ప్రజల సమాచార భద్రతకు హామీ ఇవ్వడం బ్యాంకుల ప్రాథమిక బాధ్యత.

అందుబాటులోకి వచ్చిన వార్తల ప్రకారం, ఎస్‌బీఐకి సంబంధించిన సుమారు 3.75 లక్షల రికార్డులు డార్క్ వెబ్‌లో కనిపించగా, ప్రాథమిక పరిశీలనలో వాటిలో 3,897 మంది వినియోగదారులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం ఉన్నట్లు గుర్తించారు. పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీలు, చిరునామాలు, ఈమెయిల్ వివరాలు, కస్టమర్ గుర్తింపు సంఖ్యలు, రుణ సమాచారానికి సంబంధించిన వివరాలు అందులో ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే, ఈ సమాచారమంతా ఎస్‌బీఐ ప్రధాన వ్యవస్థ నుంచే లీక్ అయిందా, ఇతర వనరుల నుంచి సేకరించబడిందా, ఖాతాల పాస్‌వర్డ్‌లు లేదా ఓటీపీలు కూడా బయటపడ్డాయా అన్నది అధికారిక దర్యాప్తుతోనే తేలాలి. డేటా లీక్ వార్తను ఖాతాల్లోని నగదు దొంగతనంగా భావించకూడదు. కానీ వ్యక్తిగత సమాచారం దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేయడమూ పొరపాటే.

ఎస్‌బీఐ ఒక్కటే ఈ సమస్యను ఎదుర్కొంటున్న సంస్థ కాదు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు సంబంధించిన సమాచారం లీక్ అయిందన్న ఆరోపణలు కూడా గతంలో వెలుగుచూశాయి. అయితే, వివిధ బ్యాంకులపై వచ్చిన ఆరోపణలన్నీ నిర్ధారిత డేటా ఉల్లంఘనలని చెప్పడానికి తగిన ఆధారాలు అవసరం. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇటీవల నమోదైన సాంకేతిక అంతరాయాన్ని కూడా డేటా లీక్‌గా పరిగణించడానికి వీల్లేదు. వార్తల్లో వినిపించే ప్రతి అంశాన్ని వాస్తవంగా ప్రకటించడం కంటే, ప్రతి ఘటనపై స్వతంత్ర విచారణ జరిపి నిజానిజాలను వెల్లడించడం ముఖ్యం.

అయితే, ఇక్కడ ప్రధాన ప్రశ్న కేవలం డేటా లీక్ జరిగిందా లేదా అన్నది కాదు; బ్యాంకులు తమ వినియోగదారుల సమాచారాన్ని ఎంత బాధ్యతగా కాపాడుతున్నాయన్నది. వినియోగదారుల గుర్తింపు, ఆదాయం, రుణాలు, లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించే అధికారం బ్యాంకులకు ఉంది. ఆ అధికారంతోపాటు వాటిని భద్రపరిచే బాధ్యత కూడా ఉంటుంది. భద్రతా వైఫల్యం జరిగినప్పుడు అస్పష్టమైన ప్రకటనలు చేయడం, నష్టాన్ని తక్కువగా చూపించడం, దర్యాప్తు పేరుతో బాధితులకు అవసరమైన సమాచారాన్ని ఆలస్యంగా అందించడం ఆమోదయోగ్యం కాదు. బ్యాంకు కార్యకలాపాలు ఆగలేదని చెప్పడం, వినియోగదారుల సమాచారం సురక్షితంగా ఉందని నిరూపించదు. సంస్థ ప్రతిష్ఠను కాపాడుకోవడం కంటే ప్రజల గోప్యతను కాపాడటానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, వ్యక్తిగత సమాచారం లీక్ అయిన తర్వాత దాని దుర్వినియోగం దీర్ఘకాలం కొనసాగవచ్చు. మోసగాళ్లు బ్యాంకు అధికారులుగా నటిస్తూ ఫోన్ చేయవచ్చు. కేవైసీ నవీకరణ, ఖాతా నిలిపివేత, రుణ చెల్లింపు వంటి పేర్లతో వినియోగదారులను భయపెట్టి ఓటీపీలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లు పొందేందుకు ప్రయత్నించవచ్చు. వ్యక్తిగత వివరాలు ముందే తెలిసి ఉండటంతో వారి మోసాన్ని గుర్తించడం మరింత కష్టమవుతుంది. అందువల్ల వినియోగదారులు అనుమానాస్పద లింకులను తెరవకూడదు; ఓటీపీలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదు. ఖాతా లావాదేవీలను తరచుగా పరిశీలించాలి. మోసపూరిత లావాదేవీ జరిగితే వెంటనే బ్యాంకుకు, సైబర్ మోసం హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలి.

ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), కేంద్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్రకు పరిమితం కాకూడదు. బ్యాంకుల సైబర్ భద్రతపై స్వతంత్ర ఆడిట్‌లు నిర్వహించాలి. సమాచారాన్ని నిర్వహించే మూడోపక్ష సంస్థలపైనా కఠిన పర్యవేక్షణ ఉండాలి. డేటా ఉల్లంఘన జరిగినప్పుడు ఎంత సమయంలో వినియోగదారులకు తెలియజేయాలి, నష్టాన్ని ఎలా అంచనా వేయాలి, బాధితులకు ఎలాంటి పరిహారం అందించాలి అన్న అంశాలపై స్పష్టమైన బాధ్యతలు విధించాలి. నిర్లక్ష్యం నిరూపితమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. కేవలం హెచ్చరికలు జారీ చేయడం సరిపోదు; నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలు జవాబుదారీగా వ్యవహరించేలా చేయాలి. డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యం ప్రజలకు అందించడమే ప్రభుత్వ, బ్యాంకుల విజయం కాదు. ఆ సౌకర్యాన్ని ఉపయోగించే ప్రతి పౌరుడి డబ్బు, వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉండేలా చూడటమే నిజమైన విజయం. ప్రజలు బ్యాంకులను నమ్మి తమ సమాచారాన్ని అప్పగిస్తారు; ఆ నమ్మకాన్ని కాపాడటం బ్యాంకుల దయాధర్మం కాదు, చట్టపరమైనదీ నైతికమైనదీ అయిన బాధ్యత. డేటా లీక్‌లకు కారణాలను వెలికితీయకుండా, బాధ్యులను గుర్తించకుండా, బాధితులకు భరోసా కల్పించకుండా డిజిటల్ విప్లవ విజయాలను ప్రకటించడం ఆత్మవంచనే అవుతుంది. ప్రజల డేటాను కాపాడలేని బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రజల విశ్వాసాన్ని కూడా కాపాడలేదన్న సత్యాన్ని పాలకులు, బ్యాంకుల యాజమాన్యాలు గుర్తించాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# పేదరిక నిర్మూలనలో తదుపరి అడుగు ఏమిటి?



పేదరికం నుంచి బయటపడటం ఒక ముఖ్యమైన విజయం. అయితే, సాధించిన ప్రగతిని నిలబెట్టుకుని మెరుగైన జీవితం వైపు సాగేందుకు కుటుంబాలకు అవసరమైన అవకాశాలను కల్పించడం కూడా అంతే ముఖ్యం. పెరుగుతున్న ఆదాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు పేదరికాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కానీ అనారోగ్యం, ఉద్యోగం కోల్పోవడం, పంట నష్టం లేదా నిత్యావసరాల ధరలు పెరగడం వల్ల కుటుంబాలు మళ్లీ కష్టాల్లోకి జారుకోవచ్చు. అందువల్ల పేదరిక నిర్మూలనలో తదుపరి దశ ప్రజలను దారిద్ర్య రేఖ దాటించడమే కాకుండా, వారు తమ అభివృద్ధిని కొనసాగించేందుకు అనువైన పరిస్థితులను కల్పించడం కావాలి.

పేదరికం తగ్గింపులో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ప్రపంచ బ్యాంకు 2026 అక్టోబరులో విడుదల చేసిన భారత పేదరికం, సమానత్వ నివేదిక ప్రకారం, 2021 కొనుగోలు శక్తి సమానత్వం ప్రాతిపదికన రోజుకు 4.20 డాలర్ల దిగువన జీవిస్తున్న జనాభా వాటా 2011లో 57.7 శాతం ఉండగా, 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. మరోవైపు, టెండూల్కర్ కమిటీ పద్ధతిపై ఆధారపడిన అంచనాల ప్రకారం పేదరికం 2022-23లో 4.7 శాతంగా, 2023-24లో 2.3 శాతంగా నమోదైంది. ఈ అంచనాలు వేర్వేరు ప్రమాణాలు, పద్ధతులపై ఆధారపడినందున వాటిని నేరుగా పోల్చలేం. అయినప్పటికీ, పేదరిక తగ్గింపులో సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఇవి స్పష్టం చేస్తున్నాయి.

దారిద్ర్య రేఖను దాటినంత మాత్రాన కుటుంబం ఆర్థికంగా స్థిరపడినట్లు కాదు. అసంఘటిత రంగ కార్మికులు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల ఆదాయాలు తరచూ హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ఆదాయం తగ్గినప్పుడు అధిక వడ్డీకి అప్పులు చేయడం, ఆస్తులను అమ్ముకోవడం లేదా ఆహారం, వైద్యం, పిల్లల చదువుపై ఖర్చులను తగ్గించుకోవడం వంటి పరిస్థితులు ఎదురవుతాయి. ఇవి వారి భవిష్యత్తు అవకాశాలను దెబ్బతీయవచ్చు. అందుకే పేదరిక తగ్గింపును ఆదాయాల పెరుగుదలతోపాటు, కుటుంబాల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పుల ఆధారంగా కూడా అంచనా వేయాలి.

ఇల్లు, వైద్యం, విద్య, రవాణా, ఆహారం వంటి అవసరాలపై పెరుగుతున్న ఖర్చులు ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తాయి. ఆదాయం పెరిగినా ఈ వ్యయాల తర్వాత పొదుపు చేసుకునే అవకాశం పరిమితంగా ఉండవచ్చు. వైద్య అత్యవసర పరిస్థితి కుటుంబాన్ని అప్పులపాలు చేయవచ్చు; నివాస సౌకర్యాల లేమి ఉపాధికి, పిల్లల చదువుకు ఆటంకం కలిగించవచ్చు. 2026 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి సురక్షిత గృహాల ప్రాధాన్యాన్ని ముందుకు తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 280 కోట్ల మందికి పైగా ప్రజలు ఏదో ఒక రూపంలో తగిన నివాస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అందుబాటు ధరల్లో గృహాలు, నాణ్యమైన ప్రజా సేవలు, సులభంగా అందే వైద్యం పేదరికాన్ని తగ్గించే విస్తృత వ్యూహంలో భాగం కావాలి.

వైద్య ఖర్చులను తగ్గించేందుకు వ్యాధుల ముందస్తు నివారణ, సకాలంలో నిర్ధారణ, అందుబాటు ధరల్లో మందులు, సమర్థవంతమైన ఆరోగ్య బీమా అవసరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంతోపాటు, ప్రజలు తమ జేబు నుంచి అధిక మొత్తాలు ఖర్చు చేయాల్సిన పరిస్థితిని తగ్గించాలి. బీమా పథకాల ప్రయోజనాలు ప్రజలకు వాస్తవంగా అందేలా సరళమైన విధానాలు, సకాలంలో పరిహారం, చికిత్స పొందడంలో తక్కువ అడ్డంకులు ఉండాలి.

సామాజిక భద్రతా పథకాల విస్తరణ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం, భారత్‌లో సామాజిక భద్రతా వ్యవస్థల పరిధిలోకి వచ్చిన జనాభా వాటా 2016లో 22 శాతం ఉండగా, 2025 నాటికి 64.3 శాతానికి పెరిగింది. ఈ పురోగతిని మరింత ఫలప్రదం చేయాలంటే పథకాల నమోదు ప్రక్రియను సరళీకరించడం, ప్రయోజనాలను సకాలంలో అందించడం, వలస కార్మికులు తాము పనిచేసే ప్రాంతంతో సంబంధం లేకుండా అర్హత మేరకు వాటిని పొందేలా చూడటం అవసరం. అర్హులైన కుటుంబాలు సమాచార లోపాలు లేదా సంక్లిష్టమైన విధానాల వల్ల ప్రయోజనాలకు దూరం కాకూడదు.

సంక్షేమ పథకాలతోపాటు స్థిరమైన ఉపాధి అవకాశాల విస్తరణ కూడా అవసరం. ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించే రంగాలను ప్రోత్సహించడం, నైపుణ్యాలను పెంపొందించడం, చిన్న వ్యాపారాలకు తోడ్పాటు అందించడం, అధికారిక రుణ సదుపాయాలను విస్తరించడం ద్వారా కుటుంబాలు తమ ఆదాయాన్ని పెంచుకోగలవు. రుణాలతోపాటు మార్కెట్ సదుపాయాలు, వ్యాపార నిర్వహణపై మార్గదర్శకత్వం అందిస్తే చిన్న సంస్థలు నిలదొక్కుకునే అవకాశాలు పెరుగుతాయి. లక్ష్యం కేవలం రుణాలు లేదా శిక్షణ కార్యక్రమాల సంఖ్యను పెంచడం కాకుండా, నిలకడైన జీవనోపాధిని సృష్టించడం కావాలి.

వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు మెరుగైన సాగునీటి సదుపాయాలు, నీటి సంరక్షణ, పంటల నిల్వ కేంద్రాలు, మార్కెట్లకు చేరువ, సమర్థవంతమైన పంటల బీమా అవసరం. ఇవి వాతావరణ మార్పులు, ధరల హెచ్చుతగ్గుల వల్ల కలిగే నష్టాలను తగ్గించగలవు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, గ్రామీణ వ్యవసాయేతర ఉపాధిని ప్రోత్సహించడం ద్వారా ఒకే ఆదాయ వనరుపై ఆధారపడే పరిస్థితిని కూడా తగ్గించవచ్చు.

కుటుంబాల పరిస్థితులు మెరుగుపడుతున్న కొద్దీ ప్రభుత్వ సహాయం కూడా తగిన విధంగా మారాలి. దారిద్ర్య రేఖను దాటిన వెంటనే సహాయాన్ని నిలిపివేయడం కంటే, కుటుంబాలు తమ జీవనోపాధిని స్థిరపరచుకుని పొదుపు పెంచుకునేందుకు తగిన సమయం ఇవ్వడం ప్రయోజనకరం. ఇందుకోసం సంక్షేమం, ఉపాధి, వైద్యం, గృహ వసతి, జీవనోపాధి కార్యక్రమాల మధ్య మెరుగైన సమన్వయం అవసరం. పేదరిక నిర్మూలనలో అసలైన విజయం దారిద్ర్య రేఖను దాటిన వారి సంఖ్యతోనే నిర్ణయించలేం. కుటుంబాలు కనీస అవసరాలను తీర్చుకోగలుగుతున్నాయా, పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించగలుగుతున్నాయా, తమ శ్రమకు తగిన ఆదాయం పొందగలుగుతున్నాయా అన్నదీ ముఖ్యం. సాధించిన ప్రగతి ప్రజల జీవితాల్లో దీర్ఘకాలిక మార్పుగా మారినప్పుడే పేదరిక నిర్మూలన లక్ష్యం పూర్తిగా నెరవేరుతుంది



కింజరాపు అమరావతి
kinjarapuamaravathi588@gmail.com



## పల్లే పట్నం ఇక లోకం నిండా నిరసన కవాతు మార్చింగ్లే..!!

జూలిప్పి పెట్రేగితే ఫాసిజం
ఉడుకుతుంది యువతరం!
హోరెత్తిన జన ప్రతిఘటనై
అట్టుడుకుతోంది భారతం!!

దేశమే వీళ్ల సొమ్మంటా
దీని సంపదంత జాగీరట!
అడ్డొచ్చిన అడిగెటోళ్లనెల్లా
అడ్డంగా నరికిపారేస్తరంట!!

రాజ్యాంగం.. హక్కులంటూ
రచ్చజేసె టోల్లెల్లా నక్సల్సట!
దిమాగీలు మోస్ట్ దేంజరంట
అందరినీ జైళ్లల్ల వేసేస్తరంట!!

ఈ వీ ఎమ్ముల లీలలు మరిగీ
ఓటు చోరి గాళ్ళిట్ల సిగ్గిడిసినా
గుట్టుగ సీట్లన్ని ఖబ్జా జేసేసినా
న్యాయం గుడ్డిగువ్వాయిక్కడ!!

దిక్కులేని దీనత్వ వేళలందు
చల్ గొంతిప్పక తప్పదంటూ!
బిగుపిడికిళ్లె అలల్లా పోటెత్తిరి
ఊరు వాడ ఏకమై గర్జించిరి!!

జెన్జీ లో కాక్రోచ్ లో ఎవ్వరైతేం
నేల తల్లి బిడ్డలు లక్షలుకోట్లు!
నేల ఈనినట్లు శివాలెత్తి కదిలి
ద్రోహుల అంతం తప్పదనిరి..!!

తుపాకి లాఠీ దొమ్మీల్ జేస్తూ
ఢిల్లీ నిండా సైన్యము జూడు!
రాజ్యహింస కోరలు నూరుతూ
ఎటు జూసినా అణచివేతలే!!

అయిషీ .. రియా .. నేహాల్లు
భారత మాత ముద్దు బిడ్డలు!
ఖాఖీ మూకల పైశాచికత్వం
లోకమెరుగగా ఎదుర్కొన్నరు!!

జంతర్ మంతర్ మైదానాలు
రాత్రిరాతిరి నిశిద్ధ మయితేం!
పల్లే పట్నం ఇక లోకం నిండా
నిరసన కవాతు మార్చింగ్లే..!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# న్యాయవ్యవస్థ స్వతంత్రత.. ప్రజల హక్కులకు రక్షణ!

న్యాయవ్యవస్థ స్వతంత్రత అనేది న్యాయమూర్తులకు సంబంధించిన సంస్థాగత సౌకర్యం మాత్రమే కాదు. అది ప్రజల హక్కులను కాపాడటానికి అవసరమైన రాజ్యాంగ రక్షణ. న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితి ఏర్పడితే, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించే వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంటుంది. 2015లో సుప్రీంకోర్టు అడ్వకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణను మెజారిటీ తీర్పుతో చెల్లదని ప్రకటించింది. న్యాయ వ్యవస్థ స్వతంత్రత రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమనే సూత్రాన్ని ఈ తీర్పు పునరుద్ఘాటించింది. న్యాయమూర్తుల నియామక విధానం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, నియామకాల్లో పారదర్శకత వంటి అంశాలపై ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటం ఎంత ముఖ్యమో, నియామక ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంచే విధానాలు ఉండటం కూడా అంతే ముఖ్యం.

స్వతంత్రత అంటే ప్రశ్నలకు అతీతంగా ఉండటం కాదు. న్యాయవ్యవస్థపై నిర్మాణాత్మక చర్చ జరగాలి. న్యాయమూర్తుల నియామకాలు, కేసుల కేటాయింపు, విచారణలో పారదర్శకత, ప్రయోజనాల సంఘర్షణను నివారించే విధానాలు వంటి అంశాలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిశీలించాలి. ప్రతి ప్రతికూల తీర్పునూ పక్షపాతానికి నిదర్శనంగా చూడలేం. అదే సమయ ంలో నిష్పాక్షికతపై సహేతుకమైన సందేహాలు తలెత్తినప్పుడు వాటిని ఆధారాలతో పరిశీలించడం కూడా అవసరమే. తీర్పుతో విభేదించడం ఒకటి; న్యాయమూర్తి పక్షపాతానికి లోనయ్యారని నిర్ధారించడం మరొకటి. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుతూనే దాని పనితీరుపై ప్రజాస్వామ్య చర్చను కొనసాగించాలి.



### గొర్రెకు కావాల్సింది జాలి కాదు.. న్యాయం!

మాంసం అమ్మేవాడి ముందు గొర్రె తన గోడు వెళ్లబోసుకుంటే, అతడు దాని బాధను అర్థం చేసుకోవచ్చు. కానీ తన ప్రయోజనాల నుంచి బయటపడలేక పోతే దానికి న్యాయం చేయలేడు. ఈ సామెతలోని అసలు సందేశం వ్యక్తుల వృత్తుల గురించి కాదు.. న్యాయం చెప్పే వ్యక్తి ప్రయోజనాల సంఘర్షణ గురించి. న్యాయం అనేది బలవంతుడి దయ కాదు. బలహీనుడి అదృష్టం కూడా కాదు. అది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును కాపాడాల్సిన వ్యవస్థలో నిష్పాక్షికతకు భంగం కలిగితే, దాన్ని సరిదిద్దే మార్గాలు అందుబాటులో ఉండాలి.

గొర్రెకు న్యాయం దక్కాలంటే మాంసం అమ్మేవాడి మనసు మారాలని ఆశించడం సరిపోదు. గొర్రె వాదనను స్వతంత్రంగా వినే న్యాయవ్యవస్థ ఉండాలి. దాని హక్కులను కాపాడే చట్టాలు ఉండాలి. ఆ చట్టాలను నిష్పాక్షికంగా అమలు చేసే వ్యవస్థలు ఉండాలి. తప్పు జరిగితే ప్రశ్నించే పౌర సమాజం ఉండాలి. న్యాయం అనేది ఒక వ్యక్తి మంచితనంపై మాత్రమే ఆధారపడకూడదు. అది నిష్పాక్షికమైన వ్యవస్థకు పునాదిగా నిలవాలి.

### న్యాయం బతికితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది!

ప్రజాస్వామ్యంలో పాలకులు మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. చట్టాలు కాలానుగుణంగా సవరణలకు లోనుకావచ్చు. కానీ న్యాయం పట్ల ప్రజలకు ఉండే విశ్వాసం దెబ్బతినకూడదు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థతోపాటు ప్రభుత్వానికి, న్యాయవాదులకు, పౌర సమాజానికి, ప్రజాస్వామ్య సంస్థలన్నింటికీ ఉంది.

న్యాయస్థానంలో ధనవంతుడు, పేదవాడు; అధికారంలో ఉన్నవాడు, సామాన్యుడు; మెజారిటీకి చెందినవాడు, మైనారిటీకి చెందినవాడు అనే తేడాలకు స్థానం ఉండకూడదు. సాక్ష్యాల విశ్వసనీయత, చట్టం నిర్దేశించిన ప్రమాణాలు, న్యాయమైన విచారణే తీర్పులకు ప్రాతిపదిక కావాలి.

న్యాయం చెప్పేవాడి ప్రయోజనాలు, న్యాయం పొందాల్సినవారి హక్కుల కంటే పైచేయి సాధించకూడదు. అధికారం కంటే రాజ్యాంగం గొప్పది. పలుకుబడి కంటే సాక్ష్యం గొప్పది. వ్యక్తిగత అభిప్రాయాల కంటే న్యాయసూత్రాలు గొప్పవి. న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే తీర్పులు నిష్పాక్షికంగా ఉండాలి. న్యాయం పొందే అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలి. విచారణలు అనవసరంగా జాప్యం కాకూడదు. ఆర్థిక స్థోమత లేనివారికి న్యాయసహాయం అందాలి. అధికార దుర్వినియోగానికి గురైనవారికి న్యాయస్థానాలు అండగా నిలవాలి. న్యాయం కొందరి సొంతం కాకూడదు. అది ప్రతి ఒక్కరి హక్కుగా నిలవాలి. బలవంతుడి ముందు బలహీనుడు తలవంచాల్సిన పరిస్థితి ఉండకూడదు. న్యాయం కోసం గొంతెత్తినవారికి భరోసా లభించాలి. ఎందుకంటే, న్యాయస్థానం బలవంతుడి అధికారానికి ముద్ర వేసే వ్యవస్థ కాదు.. బలహీనుడి హక్కులకు రక్షణగా నిలిచే వ్యవస్థ కావాలి. మాంసం అమ్మేవాడు జడ్జి అయితే గొర్రెకు న్యాయం దక్కుతుందా? అనే ప్రశ్నకు మన ప్రజాస్వామ్యం ఇచ్చే సమాధానం ఒక్కటే కావాలి. న్యాయం ఎవరి దయ మీదో ఆధారపడకూడదు. ఎవరి పలుకుబడికీ తలవంచకూడదు. ఎవరి అధికారానికీ బందీ కాకూడదు. గొర్రెకు న్యాయం దక్కినప్పుడే న్యాయవ్యవస్థ నిష్పాక్షికతకు అసలైన పరీక్ష పూర్తవుతుంది. న్యాయం బతికితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది!



మామిండ్ల రమేష్ రాజా
78932 30218

## ఉప్పల్ అభివృద్ధి పనులపై ఎంఎంసీ కమిషనర్‌తో ఎమ్మెల్యే బిఎల్ఆర్ భేటీ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌ను కోరారు. గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎంఎంసీ కమిషనర్ ను గురువారం తార్నాకల్లోని ఎంఎంసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

# సమానత్వం, సామాజిక న్యాయమే పండుగల సాయన్న లక్ష్యం

- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి
- తెలంగాణ రాబిన్‌హుడ్ 174వ జయంతి

**రంగారెడ్డి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న అని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి అన్నారు. జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు



లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు. పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశు రాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం




**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కదిరవన్ పలని అన్నారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న ప్రజా వీరుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచారని తెలిపారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పండుగ సాయన్న వంటి మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. సమాజంలోని పేదల సంక్షేమానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. వారు చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకటరామిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించాలి
- తలసాని శ్రీనివాస్ యాదవ్



**అమీర్‌పేట్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు విస్తృతంగా అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. నవంబర్ 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ బాధ్యతగా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇటీవల ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించిన నాయకులను అభినందించి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, కుర్మ హేమలత, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి. శ్రీహరి, కిషోర్, సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, గందే నాగులు, రాములు, నరేందర్, శేఖర్, ఖలీల్, వెంకటరమణ, కోటేశ్వర్ గౌడ్, ప్రేమ్, బాసా లక్ష్మి, నాగలక్ష్మి, దుర్గ, రాణి కౌర్ తదితరులు పాల్గొన్నారు.

## చక్కటి అనుబంధాలకి ప్రతీక అలాయ్ బలాయ్

- మంత్రి శ్రీధర్‌బాబు, మధుయాష్కీ గౌడ్



**ఎల్బీనగర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్ బలాయ్ వేడుకకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏఐపీసీ చైర్మన్, మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ వారికి ఆత్మీయ స్వాగతం పలికి సన్మానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పడంలో అలాయ్ బలాయ్ కీలక పాత్ర పోషిస్తోందని మధుయాష్కీ గౌడ్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏటా నిర్వహిస్తున్న ఈ వేడుక తెలంగాణ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. దత్తాత్రేయ కుటుంబంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులకు మంత్రి శ్రీధర్‌బాబు, మధుయాష్కీ గౌడ్ బహుమతులు అందజేశారు.

## గ్రామస్థాయి నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** గ్రామస్థాయి నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు సహచర ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో కలిసి తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డి గెలుపు కోసం గ్రామస్థాయి నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలని అన్నారు గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను గ్రామ, పట్టణ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులు తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి అర్హులైన వారందరూ నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు అవగాహన కల్పించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం




నిరుద్యోగులను తీవ్రంగా నిరాశపరిచిందని, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ జేఏసీతో పాటు వివిధ యూనియన్ల ప్రతినిధులను కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యక్తిగతంగా కలిసి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రతి ఓటరును నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎంఆర్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## జవహర్ నగర్‌లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ ఉక్కుపాదం

- ప్రభుత్వ భూముల్లో కబ్జాలను సహించేది లేదు
- అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం
- తహసీల్దార్ మతిన్

**జవహర్‌నగర్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** జవహర్ నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను గురువారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో రెవెన్యూ సిబ్బంది ఈ కూల్చివేతల కార్యక్రమాన్ని నిర్వహించారు. జవహర్ నగర్‌లోని వికలాంగుల కాలనీలో రెండు గదులు, బీరప్పగడ్డలో రెండు గదులు, సేవాలాల్ తండాలో రెండు గదులు, లక్ష్మీ నరసింహ కాలనీలో ఒక గదిని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించినట్లు గుర్తించిన అధికారులు వాటిని తొలగించారు.

### ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ఈ సందర్భంగా కాప్రా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ, జవహర్ నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను అమాయక పేదలకు విక్రయిస్తూ



అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా రెవెన్యూ శాఖ పనిచేస్తోందని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సామా రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- మంత్రి శ్రీధర్ బాబు



**శంషాబాద్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. గురువారం శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనకు మద్దతుగా విద్యావంతులు, ఉద్యోగులు కాంగ్రెస్ అభ్యర్థికి అండగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, మండల, డివిజన్ కమిటీలను పూర్తి చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, టి. రామ్మోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మనోహర్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దారాసింగ్ జాదవ్‌తో పాటు పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జులు, పీసీసీ నాయకులు, జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ అభివృద్ధి పనులపై కమిషనర్ సమీక్ష

**బోడుప్పల్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన, భూవివాదాలు, నాలా అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, ఎస్ఎన్‌డీపీ పనులు, మార్కెట్ల ఏర్పాటుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన పౌర సదుపాయాలు కల్పించేందుకు పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### డంపింగ్ యార్డు భూములపై సమీక్ష

సర్వే నంబర్ 53లోని డంపింగ్ యార్డు భూములకు సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, స్టేటస్‌కోలో ఉన్న అంశాలపై కమిషనర్ సమీక్షించారు. కేసుల పరిష్కారానికి అవసరమైన న్యాయపరమైన చర్యలు చేపట్టాలని, పరిష్కారమైన కేసులకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు ఉత్తర్వులను ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. అవసరమైన చోట విచారణలు నిర్వహించి, కారణాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సుద్దకుంట నాలా పనులకు చర్యలు

సుద్దకుంట నాలా అభివృద్ధి పనులు ముందుకు సాగేందుకు ఇరిగేషన్ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాలని సూచించారు. హైడ్రా అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అనుమతులు తీసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### ట్రాఫిక్ ఇబ్బందుల తొలగింపునకు చర్యలు

బోడుప్పల్ టర్నింగ్‌తో పాటు చెంగిచెర్ల--టులిప్ రోడ్డులోని ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. రహదారుల విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత శాఖల సమన్వయంతో తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భూమిలోని ప్లేగ్రౌండ్ వరకు అవసరమైన స్థలాన్ని రాకపోకలకు అనుకూలంగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. 30 నుంచి 40 అడుగుల వెడల్పు ఉన్న రహదారుల వద్ద పరిస్థితులకు అనుగుణంగా బెల్‌మౌత్ ప్రాంతాలను ఫ్రీ లెఫ్ట్ సౌకర్యాలుగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. దీంతో జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు.

### రూ.96 కోట్ల పనులకు కొత్త ప్రతిపాదనలు

ఎస్ఎన్‌డీపీ కింద గతంలో మంజూరైన రూ.96 కోట్ల పనులకు సంబంధించి ప్రస్తుత ప్రతిపాదనలను రద్దు చేసి, తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి కొత్త ప్రతిపాదనలు పంపించాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ ఆమోదం అనంతరం నిబంధనల ప్రకారం తాజా టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. బోడుప్పల్‌లో సమీకృత కూరగాయల, మాంసాహార మార్కెట్ల



ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ప్రతిపాదనలను రద్దు చేసి, అవసరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం కొత్తగా టెండర్లు చేపట్టాలని సూచించారు.

### సమన్వయంతో పనులు పూర్తి చేయాలి

కోర్టు కేసులు, భూవివాదాలు, డ్రైనేజీ పనులు, ట్రాఫిక్ సమస్యలు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన అనుమతులు, ప్రభుత్వ ఆమోదాలను త్వరితగతిన పొందాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

# నీటి చుక్కే.. రేపటి జీవనానికి రక్ష



- నీరు ఉంటేనే జీవం.. నీటిని కాపాడితేనే భవిష్యత్తు!
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం.. నీటిని ఆదా చేద్దాం!
- వర్షాభావ పరిస్థితులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం
- ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తును కాపాడుకుందాం
- నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**కోహిర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంపై చర్చ పెరుగుతున్న వేళ నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. వర్షాలు సమృద్ధిగా కురిసినా, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

### ఎల్‌నినో అంటే ఏమిటి..?

పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా మారే వాతావరణ పరిస్థితిని ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశలు, వర్షపాత సరళులు, ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది. భారతదేశంలో రుతుపవనాలపై ఎల్‌నినో కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అయితే ఎల్‌నినో ఏర్పడిన ప్రతిసారీ కరువు వస్తుందని చెప్పలేం. ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల వాతావరణ అంచనాలతో సంబంధం లేకుండా నీటి సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టడం అవసరం.

### నీటి కొరత.. రైతులకు పెను సవాల్

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. భూగర్భ జలమట్టాలు పడిపోతే బోరుబావులపై ఆధారపడే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. పంటలకు అవసరమైన నీరు అందకపోతే దిగుబడులు తగ్గి రైతుల ఆదాయంపై ప్రభావం పడవచ్చు. పశువులకు తాగునీరు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా చేయడం కూడా సవాల్‌గా మారవచ్చు. ఈ పరిస్థితులను నివారించాలంటే సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నీటి నిల్వలు పెంచుకునే చర్యలు చేపట్టడం మేలు.

### ప్రతి ఇంట్లో నీటి పొదుపు అవసరం

నీటి సంరక్షణ అనేది ప్రభుత్వాలకే పరిమితమైన కార్యక్రమం కాదు. ప్రతి కుటుంబం తమవంతు బాధ్యతగా భావించాలి. అవసరం లేనప్పుడు కుళాయిలను తెరిచి ఉంచకూడదు. నీటి పైపుల్లో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. వాహనాలు శుభ్రం చేయడం, ఇంటి పరిసరాలను కడగడం వంటి పనులకు సాధ్యమైనంత తక్కువ నీటిని వినియోగించాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. ఇళ్లలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్నచిన్న పొదుపు చర్యలే భవిష్యత్తులో పెద్ద నీటి సంక్షోభాన్ని నివారించేందుకు దోహదపడతాయి.

### వ్యవసాయంలో నీటి వినియోగంపై అవగాహన

నీటి కొరతను ఎదుర్కొనేందుకు రైతులు పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించే పద్ధతులను అనుసరించాలి. సాధ్యమైన చోట బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలి. నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించాలి. ప్రాంతానికి అనుకూలమైన, తక్కువ నీటితో సాగు చేయగల పంటల ఎంపికపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు, కాలువల్లో అవసరమైన పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా పొలాల్లో నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చు.

### గ్రామాల స్థాయిలో సమష్టి కార్యాచరణ

గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. పాడైపోయిన నీటి పైపుల మరమ్మతులు, చెరువుల పరిరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, చెట్ల పెంపకం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాగునీటి వనరులు కలుషితం కాకుండా కాపాడాలి. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు అవగాహన కల్పించాలి.

వర్షాకాలంలో కురిసే నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా వాటిని పరిరక్షించాలి. గ్రామాల్లో నీటి లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చు.

### నేటి నీటి పొదుపే.. రేపటి భద్రత

నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వనరు. దానిని వృథా చేయడం అంటే భవిష్యత్తు తరాల అవసరాలను నిర్లక్ష్యం చేయడమే. ఎల్‌నినో ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంచనాలు మారవచ్చు. కానీ నీటి అవసరం మాత్రం ఎప్పటికీ ఉంటుంది. వర్షాలు తగ్గినప్పుడు నీటి పొదుపు చర్యలను మరింత కఠినంగా పాటించాలి. వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడే నీటిని నిల్వ చేసుకోవడం, భూగర్భ జలాలను పెంపొందించడం, నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు భరోసా కల్పించవచ్చు. అని సజ్జాపూర్, కొత్త కాపు. గోవర్ధన్ రెడ్డి.వర్షాలు తగ్గినప్పుడు నీటి పొదుపు చర్యలను మరింత కఠినంగా పాటించాలి.

# రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి

- సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్



**బెజ్జంకి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** రైతులకు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను 24 గంటలు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం బెజ్జంకి మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి,అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా రైతులు బోర్ల ఆధారంగా వరి సాగు చేస్తున్నారని,రోజుకు 8 నుంచి 10 గంటలే విద్యుత్ సరఫరా కావడంతో పంటలకు నీరందక ఇప్పటికే పలువురి పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉన్నందున నీరు ఎంతో అవసరమని తెలిపారు.పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం రైతులకు మాత్రం 24 గంటల విద్యుత్ అందించకపోవడం దారుణమని విమర్శించారు.వెంటనే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని,లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బోనగిరి లింగం,కుంట సత్తయ్య,గాజరాజు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పక్కగా భూ రీ సర్వే

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**తూప్రాన్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** పక్కగా భూ రీ సర్వే చేసి భూ తగాదాలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. పక్కగా భూ సర్వే నిర్వహించి , రైతులకు భూ తగాదాలు లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే 1200 ఎకరాల్లో భూ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అధికారులందరూ పక్కా వివరాలతో సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో తూప్రాన్ బావయ్య ఎ డి ల్యాండ్ సర్వేయర్ కిషన్, తాహాసిల్దార్ ఆంజనేయులు, నాగరాజు, ప్రశాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా, పెన్షన్ పథకాల్లో చేరాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక భద్రత పొందాలని పిలుపునిచ్చారు. వనపర్తి మండలం నాచహల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచార శిబిరానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ఏడాదికి కేవలం రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా ఏడాదికి రూ.436 ప్రీమియంతో, పథకం నిబంధనలకు అనుగుణంగా మరణించిన సందర్భంలో రూ.2 లక్షల బీమా ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజనపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అర్హతలు, పథకం నిబంధనలకు అనుగుణంగా క్రమం తప్పకుండా పొదుపు చేయడం ద్వారా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకాల్లో చేరని అర్హులు సమీప బ్యాంకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని




కోరారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవడంతో పాటు పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది వివిధ బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, ఎల్డీఎం శివకుమార్, డీఎల్పీవో రఘునాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అబ్దుల్లా, సంబంధిత అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. గురువారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి,తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి.రిజిస్ట్రేషన్,చెక్ అప్ వంద శాతం జరిగేలా చూడాలని అన్నారు. ఆస్పత్రిలోఅన్ని రిజిస్టర్లు సక్రమంగానిర్వహించాలని,రక్తపరీక్షలు,మూత్ర పరీక్షలు,ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసితక్షణ రోగ నిర్ణయం చేయాలనిఅన్నారు.అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు.కుక్క కాటు,పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా అవసరమైన మందులు,వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య



కేంద్రం లోపల, బయట పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణంకల్పించాలన్నారు.గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని,వైద్య అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఝాన్సీరాణి,డాక్టర్ స్వరూపరాణి,సీనియర్ అసిస్టెంట్ కరీం,వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో తక్కువ నీటి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి



**కల్హేర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలోని వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి వి. వెంకటేశం వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి గురువారం సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుందని, మరో వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గాయని, రాబోయే మూడు నెలల్లో నీటి లభ్యతపై మరింత తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉందని రైతులకు వివరించారు.ఈ నేపథ్యంలో రాబోయే యాసంగి 2026-27 సీజన్‌లో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే శనగ, కుసుమ, ఇతర పప్పుధాన్యాలు, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే నీటి లభ్యతను బట్టి ఆధునిక నీటి పొదుపు పద్ధతులతో కూరగాయల సాగు చేపట్టవచ్చని, ఆయిల్‌పామ్ వంటి పంటలను తగిన సాగునీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోనే పరిగణించాలని తెలిపారు.రైతులు తమ భూముల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేల స్వభావం, భూగర్భ జలాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి పంటల ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి కొరత ప్రభావాన్ని తగ్గించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వి. వెంకటేశం మండల వ్యవసాయ అధికారి, కల్హేర్ బి. కృష్ణవేణి – వ్యవసాయ విస్తరణ అధికారి, కల్హేర్ పి. సాయిలు – వ్యవసాయ విస్తరణ అధికారి, కృష్ణాపూర్ టి. నాగేందర్ – వ్యవసాయ విస్తరణ అధికారి, బీబీపేట్ మరియు రైతులు పాల్గొన్నారు.

# సాగుభూమి సంరక్షణపై రైతులకు అవగాహన



**టేక్మాల్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** సాగు భూమిని సంరక్షించడంతో పాటు నీటిని వృథా చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ అన్నారు. గురువారం ఎల్లుపేట రైతు వేదికలో సాగు భూమి సంరక్షణ (ఖేత్ బచావో అభియాన్) కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.రసాయన ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వాడటం వల్ల భూసారం తగ్గి సాగు ఖర్చులు పెరుగుతాయని తెలిపారు. యూరియా, డీఏపీ వంటి ఎరువులను తగిన మోతాదులోనే వినియోగించాలని, ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.పంట కోత అనంతరం కొయ్యకాళ్లను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాసంగిలో నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.జొన్నలు, శనగలు, తెల్లకుసుమలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ప్రసాద్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎఫ్‌పీఓ ప్రతినిధి వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈఓ సుభాష్ పాల్గొన్నారు. ఎల్లుపేట సర్పంచ్ మాధవి నర్సింహారెడ్డి ఎల్లుపేట క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**తూప్రాన్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** మండలం లోని కిస్టాపూర్ గ్రామంలో మాదిగ సామాజిక వర్గంపై కుల బహిష్కరణ, బతుకమ్మ ఆడనివ్వకపోవడం, హనుమాన్ ఆలయంలోకి అనుమతించకపోవడం, పై చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు తూప్రాన్ ఆర్డీవో బావయ్యకు తాసిల్దార్ చంద్రశేఖర్ ఇంటికి డిఎస్పి కి పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భంగా మాట్లాడారు. శు భకార్యాలకు ఆహ్వానించిన వారి ఇంటికి వెళ్లి భోజనం చేస్తే, ఆహ్వానించిన కుటుంబానికి లక్ష జరిమానా విధించాలని నిబంధనలు పెట్టుకుని కుల వివక్ష చూపిస్తున్న కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ భర్త సుక్క శ్రీశైలం, అతని వర్గం పై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయాలు బహుజన్ సమాజ్ పార్టీ దృష్టికి రావడంతో ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అంశంపై బీఎస్పీ నాయకులు తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని స్థానికతూప్రాన్ ఆర్డిఓ బావయ్యకు, ఎమ్మార్వో, చంద్రశేఖర్ రెడ్డి డిఎస్పి అధికారులకు ఫిర్యాదు చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్ కొండయ్య నరేష్ వినోద్ కోరారు. ఈ కార్యక్రమంలో కిస్టాపూర్ గ్రామ మాదిగ సంఘం యువకులు, పెద్దలు, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ళ నరేష్,నియోజకవర్గ ఇంచార్జి కెత్తోజి వినోద్ చారి, గజ్వేల్ అసెంబ్లీ అధ్యక్షులు కొమ్ము చంద్రం, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఇంచార్జి కిరణ్ నాయకులు పాల్గొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డ్‌తో రోగాల బారిన జనం

- దెబ్బతింటున్న పంట పొలాలు
- 9వ వార్డు విజయనగర్ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానం
- అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం
- పంటలు నష్టపోతున్నామని రైతుల ఆవేదన
- సమస్యలు తీర్చకపోతే మున్సిపాలిటీ ముట్టడికి హెచ్చరిక
- పాలకవర్గం లేక కుంటుపడ్డ పాలన
- మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్

**జడ్చర్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు జయప్రకాష్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడం శోచనీయమని మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల స్థానికులు తీవ్ర రోగాల బారిన పడుతున్నారని, మరోవైపు డంపింగ్ యార్డ్ వ్యర్థాల వల్ల సమీప పొలాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోతున్నారని మండిపడ్డారు. తక్షణమే అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పాలకవర్గం లేకపోవడంతో పాలన పూర్తిగా కుంటుపడిందని, విజయనగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల తండాల్లో పారిశుద్ధ్య పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. వార్డులోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్‌కు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా, ఆధారాలుగా ఫోటోలు, వీడియోలు పంపినా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. పన్నులు వసూలు చేస్తున్న అధికారులు, కనీస పారిశుద్ధ్య వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కాలనీలో మురుగుకాలువలు నిండి దుర్గంధం వెదజల్లుతోందని, డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ తో పాటు పారిశుద్ధ్య సమస్యలపై అధికారులు తక్షణమే



స్పందించి చర్యలు తీసుకోకపోతే, 9వ వార్డు ప్రజలు, బాధితులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివరాములు, ఆశీర్వాదం, ఏలియా, రాజ మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, బెన్నీ, కమలం, శేఖర్, సన్నీ, సూర్య చౌహాన్, అల్తాఫ్, మొబీన్, అఖిల్, నయీమ్ ఖాన్, అంజాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబరులో జాతీయస్థాయి క్రీడా సంబరం

- దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

### క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

# కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల దందా!

- రూ.39.14 లక్షలు కాంట్రాక్టర్ల నుంచి బదిలీ!
- బిల్లుల చెల్లింపులకు పర్సంటేజీలు
- ఫోన్లలో బయటపడ్డ బాగోతం
- డీఆర్‌డీఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- ఇద్దరు అధికారుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య









**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** భూగర్భ జలాలను పెంపొందించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయాల్సిన వాటర్‌షెడ్ ప్రాజెక్టులో అవినీతి బాగోతం వెలుగుచూసింది. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టాల్సిన పనుల్లో పర్సంటేజీల పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వ్యవహారం ఏసీబీ తనిఖీలతో బట్టబయలైంది. కాంట్రాక్టర్ల నుంచి ఏకంగా రూ.39.14 లక్షలు వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. బిల్లుల చెల్లింపుల సమయంలో డబ్బులు బదిలీ చేయాలంటూ సందేశాలు పంపినట్లు ఆధారాలు సేకరించామని తెలిపారు. ఈ వ్యవహారంలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి సతీష్‌రెడ్డి, టెక్నికల్ అధికారి రాజును అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) కార్యాలయంలో రికార్డుల పరిశీలనతో పాటు సంబంధిత ఫోన్లలోని సమాచారాన్ని తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

### పర్సంటేజీల పేరుతో వేధింపులు..

ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన అధికారులు.. అదే బిల్లుల పేరుతో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. పనులు పూర్తి చేసినా బిల్లుల చెల్లింపుల విషయంలో పర్సంటేజీల కోసం ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చినప్పటికీ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదనే ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. రేగొండ మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. డీఆర్‌డీఓ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి, సంబంధిత రికార్డులు, ఫోన్ సమాచారాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో నగదు బదిలీలకు సంబంధించిన వివరాలు సేకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

### ఫోన్ సందేశాలే కీలక ఆధారాలు..

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల సమయంలో నగదు బదిలీ చేయాలంటూ ప్రాజెక్టు అధికారి సతీష్‌రెడ్డి, టెక్నికల్ అధికారి రాజు సందేశాలు పంపినట్లు దర్యాప్తులో గుర్తించామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఆ సందేశాల్లో పేర్కొన్న ఖాతాలకు కాంట్రాక్టర్ల నుంచి సుమారు రూ.39,14,000 బదిలీ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, రికార్డులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పనుల బిల్లుల చెల్లింపుల వ్యవహారంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరిగినట్లు వెల్లడికావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

### మూడు మండలాల్లో వాటర్‌షెడ్ పనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా రేగొండ, మల్హర్‌రావు, పలిమెల మండలాలను వాటర్‌షెడ్ ప్రాజెక్టు అమలుకు ఎంపిక చేశారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం కోసం గుంతలు తవ్వడం, ఊటగుంటలు నిర్మించడం వంటి పనులు చేపడుతున్నారు. రేగొండ మండలంలోని భాగిర్తిపేట, గూడెపల్లి, మడతపల్లి, నారాయణపూర్, దుంపిళ్లపల్లి, పొనగండ్ల గ్రామాల్లో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ పనులను నలుగురు కాంట్రాక్టర్లు చేపడుతున్న నేపథ్యంలో బిల్లుల చెల్లింపులు, నగదు బదిలీల వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.

### లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి..

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయడానికి లేదా బిల్లులు మంజూరు చేయడానికి ఎవరైనా అధికారులు, ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే సహించేది లేదని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. బాధితులు భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా వాటర్‌షెడ్ ప్రాజెక్టులో వెలుగుచూసిన ఈ వ్యవహారం ప్రభుత్వ అభివృద్ధి పనుల పర్యవేక్షణ, బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో అవినీతి అధికారులు మామూళ్ల కోసం పీడించడం మరోసారి బట్టబయలైంది. వరుస ఘటనలతో అవినీతి అధికారుల్లో వణుకు మొదలైంది. కొద్ది నెలల క్రితం కోర్టు సిబ్బంది, కలెక్టరేట్ లోని మైనింగ్ అధికారి అవినీతి బాగోతాలపై ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రాజెక్టు అధికారి ఆఫీసులో ఇద్దరు అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

# విద్యుద్ఘాతంతో రైతు మృతి

**ములుగు ప్రతినిధి, అక్టోబర్22 (జనంసాక్షి):** ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాకారం గ్రామ శివారులో అబ్బాపూర్ రోడ్డులో ఉన్న మొక్కజొన్న చేనులో ఏర్పాటు చేసిన విద్యుత్ ఫెన్సింగ్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో శామంతుల సమ్మాలు(65) రైతు మృతి చెందినట్లు పిర్యాదు తీసుకోవడం జరిగిందనీ ములుగు ఎస్ఐ ఎస్.వెంకటేష్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం మృతుడు తన వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు.పంటను అడవి జంతువుల నుంచి రక్షించేందుకు గత నెలలో సోలార్ పవర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అయితే, అడవి జంతువుల నుంచి పంటను రక్షించాలనే ఉద్దేశంతో మనుషుల ప్రాణాలకు ప్రమాదం కలుగుతుందని తెలిసి కూడా సోలార్ ఫెన్సింగ్‌కు స్టార్టర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. 21 అక్టోబర్ 2026 రోజున సాయంత్రం సుమారు 4గంటలకు మృతుడు మొక్కజొన్న చేనుకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతకడం ప్రారంభించారు. అనంతరం రాత్రి సుమారు 8:30 గంటలకు చేనులో పరిశీలించగా, మృతుడు విద్యుత్ ఫెన్సింగ్ వైర్లపై పడి మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనపై చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ నుంచి ప్రజలకు విజ్ఞప్తి పంటలను అడవి జంతువుల నుంచి రక్షించేందుకు విద్యుత్ వైర్లకు నేరుగా విద్యుత్ సరఫరా చేయడం ప్రాణాంతకం. ఇటువంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దు. చట్టబద్ధమైన, సురక్షితమైన పద్ధతులను మాత్రమే అనుసరించాలని, విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ ములుగు ఎస్ఐ ఎస్.వెంకటేష్ అన్నారు.

# పక్క నియోజకవర్గాలకు దేవాదుల జలాలు..

- పాలకుర్తి రైతులకు కన్నీళ్లే మిగిలాయా?
- పొలాలు ఎండుతున్నా పట్టించుకోరా..?
- ఎమ్మెల్యే పనితీరుపై రైతుల ఆగ్రహం
- సాగునీటి కోసం మండుటెండలో రైతుల ఆవేదన.. పాలకుర్తికి నీరెప్పుడు?



**దేవరుప్పుల, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ఒకవైపు పక్క నియోజకవర్గాల్లో చెరువులు నిండుకుండలా దర్శనమిస్తుంటే.. మరోవైపు పాలకుర్తి నియోజకవర్గంలో సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదుల జలాలు పక్క ప్రాంతాలకు వెళ్తున్నా తమ పొలాలకు సాగునీరు అందకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలను పాలకులు పట్టించుకోవడం లేదంటూ పాలకుర్తి ఎమ్మెల్యే పనితీరుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. దేవరుప్పుల మండలంలోని రామరాజుపల్లి, నీర్మాల గ్రామాలకు చెందిన రైతులు గురువారం జీడికల్ మండలం గొలనుకొండ గ్రామ శివారులో ప్రవహిస్తున్న దేవాదుల జలాలను చూసి తమ ప్రాంతానికి సాగునీరు ఎందుకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్, ఆలేరు నియోజకవర్గాలకు సాగునీరు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, తమ ప్రాంత రైతుల సమస్యలపై కూడా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు. పండుగ పూట కూడా సాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన పరిస్థితి తమకు ఎదురైందని రైతులు వాపోతున్నారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో నీరు అందకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేవాదుల జలాలు అందుబాటులో కనిపిస్తున్నా, మరోవైపు తమ పొలాలు ఎండిపోతుండటం పాలకుల పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొంటున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రైతుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రజాప్రతినిధులు సాగునీటి అంశంపై తక్షణమే స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ విభేదాలు, ఇతర అంశాల కంటే రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లోనూ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికే సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి దేవాదుల జలాల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. దేవరుప్పుల మండలంలోని రామరాజుపల్లి, నీర్మాల సహా సాగునీటి కొరత ఎదుర్కొంటున్న గ్రామాల రైతులకు తక్షణమే సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు నీటి విడుదలపై అధికారులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, పాలకుర్తి ఎమ్మెల్యే రైతుల సమస్యను అత్యవసరంగా పరిగణించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. రైతుల కన్నీళ్లు తుడిచి, పంటలకు నీరందించినప్పుడే ప్రజాప్రతినిధుల బాధ్యతకు నిజమైన అర్థం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో రామరాజుపల్లి సర్పంచ్ బోయిని మహేందర్ నీర్మాల మాజీ సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్ రెడ్డి మాజీ ఏఎంసీ డైరెక్టర్ కూతాటి నరసింహులు ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి పల్లెర్ల నవీన్ మాజీ ఉప సర్పంచ్ కోశన నాగరాజు ఉప్పునూతల నరసింహులు దాసగాని సత్యనారాయణ లేగ సోమిరెడ్డి కాసర్ల దయాకర్ రెడ్డి సుద్ధపల్లి సోమయ్య కొత్త చిత్తరంజన్ రెడ్డి సింగరపు అశోక్ రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జల్లిలో తాటి వనం దగ్ధం



**చెన్నారావుపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో తాటి వనం దగ్ధమైన సంఘటన మండలంలోని జల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామ శివారులోని ఊర చెరువు సమీపంలో చెన్నారావుపేట- నెక్కొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న తాటివనానికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగి 11 తాటి చెట్లు, 10 తాటిబొత్తలు దగ్ధమైనట్లు గ్రామ ఉపసర్పంచ్ మెరుగు బాబు, గీత కార్మికులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు నిప్పంటించడంతో తాటి చెట్లు దగ్ధమవడంతో గీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అటవీ జంతుల కోసం కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు

- పంటల రక్షణకు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి..
- ములుగు డిఎస్పి రవీందర్



**ములుగు ప్రతి నిధి, అక్టోబర్ 22(జనం సాక్షి):** అటవి జంతువుల నుండి రక్షణ కోసం పంట పొలాలలో కరెంట్ ఉచ్చులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు డిఎస్పి రవీందర్ హెచ్చరించారు. అటవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చుల వలన మనుషుల ప్రాణాలు పోతున్నాయని తద్వారా సంపాదించే కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వెల్లడించారు. ఇటీవల కాలంలో ములుగు మండలంలోని జాకారం గ్రామ పంచాయతీ పరిధిలో ఇలాగే పంట పొలాలలో కరెంట్ ఉచ్చులు పెడితే మనుషుల ప్రాణాలు పోయి సదరు వ్యక్తులు జైలు పాలు అయిన సంగతి గుర్తు చేశారు. అందువల్ల పంటల రక్షణ కొరకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి అని, కరెంటు ఉచ్చులు పెట్టి అనవసరంగా జైలు పాలు కావద్దని హెచ్చరించారు. ఎవరైనా వ్యక్తులు కరెంటు ఉచ్చులు పెట్టినట్టు తెలిసిన, కనిపించిన వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# ఆయుష్ శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా-డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ https://www.mancherial.telangana.gov.in వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్ లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

# యాప్‌తో ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ప్రజలు ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు జరుగుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరించాయని తెలిపారు. ఈ మోసంలో భాగంగా సైబర్ నేరగాళ్లు బాధితులను యాప్ ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రేరేపిస్తున్నారు. అనంతరం భారతీయ రూపాయలను ఎక్స్ఛేంజ్ ద్వారా క్రిప్టోకరెన్సీగా మార్చి పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 56 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అధిక లాభాలు, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలను నమ్మవద్దు. తెలియని వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లను, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. ధృవీకరించని యాప్‌లు, ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లలో డబ్బు పెట్టుబడి పెట్టవద్దు. క్రిప్టోకరెన్సీ రూపంలో డబ్బు బదిలీ చేయాలని కోరితే అప్రమత్తంగా ఉండండి. మీ ఓటీపీలు బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దు. ఇతరులను రిఫర్ చేస్తే అదనపు ఆదాయం వస్తుందని చెప్పే పథకాల పట్ల జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని, త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# కొమురం భీమ్ విగ్రహాల వద్ద తాగుబోతుల ఆగడాలు

- పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలి: ఆదివాసీ నాయకులు



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** కొమురం భీమ్ 125వ జయంతిని పురస్కరించుకొని గురువారం నిర్మల్ పట్టణంలోని మున్సిపల్, అటవీ శాఖ కార్యాలయాల ఎదుట ఉన్న ఆయన విగ్రహాలకు ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం, తుడుం దెబ్బ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కొమురం భీమ్ జయంతి, వర్ధంతి రోజులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విగ్రహాల పరిసరాల్లో తాగుబోతులు మద్యం సీసాలు పడేస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొమురం భీమ్ స్ఫూర్తితో ఆదివాసులు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలేని వారికి ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేయడాన్ని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, సవీన్, రమేష్, గోవర్ధన్, నర్సారెడ్డి, నైతం భీమ్‌రావు, సూర్యభాను, ఉయిక భీమ్‌రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి మరో రూపం రెడ్ క్రాస్ సొసైటీ..

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రెడ్‌క్రాస్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం జిల్లా కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించనైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని వారు పేర్కొన్నారు. మానవత్వానికి మరో రూపం ఇండియన్ రెడ్ క్రాస్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గా సేవా దృక్పథం తో పనిచేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రపంచవ్యాప్తంగా మానవతా విలువలకు, స్వచ్ఛంద సేవలకు ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి పౌరుడు రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకొని సమాజ సేవలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖల సహకారంతో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

వయోవృద్ధుల కోసం 'ప్రణామ్' కార్యక్రమం ద్వారా ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించి, వారిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ - మాదకద్రవ్య రహిత వరంగల్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతకు ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని నీటి పొదుపు, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరంలో ఉన్న పేదలు, నిరుపేదలు, బాధితులకు రెడ్‌క్రాస్ సభ్యులందరూ సమన్వయంతో సేవలందించాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వరంగల్ బేతి అశోక్ బాబు మాట్లాడుతూ వరంగల్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవన సముదాయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలని, ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ స్టోర్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసి, అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయం మేరకు ఇ.వి. శ్రీనివాసరావును ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా సలహాదారుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## దుర్గామాత ఊరేగింపులో ముస్లిం సోదరుల తాగునీటి సేవ




**కొండమల్లేపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని, మానవత్వమే అన్నింటికంటే గొప్పదని పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు చాటిచెప్పారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన దుర్గామాత ఊరేగింపులో హిందూ సోదరులకు మంచినీటిని అందించి సోదరభావాన్ని చాటుకున్నారు. భారత్ ఫుట్ వేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం మత సామరస్యానికి, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచింది. దుర్గామాత ఊరేగింపులో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తూ ముస్లిం సోదరులు సేవాభావాన్ని చాటుకున్నారు. మతాలకు అతీతంగా తోటి మనుషుల అవసరాలను గుర్తించి సహాయం చేయడమే నిజమైన మానవత్వమని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. పండుగలు, ఉత్సవాలు కేవలం ఆచారాలకు మాత్రమే పరిమితం కాకుండా.. ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించి, ఐక్యతను బలోపేతం చేయడానికి వేదికలుగా నిలవాలని వారి సేవా దృక్పథం చాటిచెప్పింది. మతం ఏదైనా.. సేవ చేసే హృదయం ఒక్కటే అనే సందేశాన్ని ఈ కార్యక్రమం సమాజానికి అందించింది. మతసామరస్యం, మానవత్వం వెల్లివిరిసే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు షకీల్, షంషోద్దీన్, బాబా భాయ్, ముస్తఫా, జకీ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల నిర్లక్ష్యంతో తృటిలో తప్పిన ప్రమాదం

- పలువురికి గాయాలు



**లింగంపేట, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** డ్రైవర్ల అజాగ్రత్త, అతివేగం వల్ల ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న ఎల్లమ్మ తండా గ్రామ సమీపంలోని ఓ కల్వర్టు వద్ద.. ఆర్టీసీ బస్సును, ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టే ప్రయత్నం చేశాడు. ప్రమాదాన్ని పసిగట్టిన బస్సు డ్రైవర్ రాజు చాకచక్యంగా వ్యవహరించి బస్సును కల్వర్టు చివరకు తీసుకెళ్లి నియంత్రించే ప్రయత్నం చేశారు. అయితే, ఆ మార్గం అత్యంత ఇరుకుగా ఉండటంతో రెండు వాహనాలు కల్వర్టులోనే పక్కపక్కనే ఇరుక్కుపోయాయి. లారీ, టిప్పర్ ఒకదానికొకటి రాసుకుంటూ నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సదరు టిప్పర్ డ్రైవర్ అక్కడ నుండి పరారయ్యాడనీ స్థానికులు చెప్పారు. సంఘటన స్థలానికి లింగంపేట సే దీపక్ కుమార్ అక్కడికి చేరుకొని రాకపోకలకు అంతరాయం కలగకుండా ఇరుకు బ్రిడ్జిలో నిలిచిపోయినటువంటి బస్సు టిప్పర్లను బయటకు తీశారు యధావిధిగా రాకపోకలు కొనసాగాయి.

## అక్రమంగా తరలిస్తున్న 8 పశువులను కాపాడిన పోలీసులు

- ముగ్గురు నిందితులపై కేసు నమోదు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా మరియు క్రూరంగా తరలిస్తున్న 8 మూగజీవాలను పోలీసులు రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గురువారం తెల్లవారుజామున పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు వస్తున్న ఒక మహీంద్రా బొలెరో వాహనం (నెం. TG 28 T 4189) పోలీసులను చూసి వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించింది. అనుమానం వచ్చిన పోలీసులు ఆ వాహనాన్ని వెంబడించి పాల్వంచ అంబేద్కర్ సెంటర్ వద్ద అడ్డగించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వాహనంలో 4 ఆవులు, 4 లేగదూడలను గుర్తించారు. పశువుల సామర్థ్యానికి మించి వాటిని ఒకదానిపై మరొకటి పడే విధంగా, కాళ్లు, మెడలకు తాళ్లతో బిగించి, గాలి ప్రసరణ లేదా మేతకు ఎలాంటి సదుపాయాలు లేకుండా అత్యంత క్రూరంగా తరలిస్తున్నట్లు తేలింది. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. కొత్తగూడెంలోని కబేళాకు ఈ పశువులను తరలిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు క్రింది ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కొర్ర రామ (డ్రైవర్), తండ్రి: మంగిత్య, నివాసం: హోలియాతండా, కొత్తగూడెం. మహమ్మద్ ఫయాజ్ ఖురేషి, తండ్రి: గౌస్, నివాసం: ఓల్డ్ డిపో రోడ్, కొత్తగూడెం (కొత్తగూడెంలో మాంసం దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి). మహమ్మద్ రెహాన్, తండ్రి: మహమ్మద్ ఫయాజ్ ఖురేషి. పంచుల సమక్షంలో పశువులను, రవాణాకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రక్షించిన 8 పశువులను మెరుగైన సంరక్షణ నిమిత్తం పాల్వంచలోని 'అన్నపూర్ణ గోసంరక్షణ సమితి'కి అప్పగించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ టి నాగరాజు తెలిపారు. మూగజీవాలను క్రూరంగా తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## డీజే కోసం రోడ్డెక్కిన స్వాములు మహిళలు గ్రామస్తులు

### పోలీసు వర్సెస్ గాంధారి మండల కేంద్ర ప్రజానికం

### స్తంభించిన ట్రాఫిక్..



**గాంధారి, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** దుర్గా దేవి శరన్నవరాత్రులు ముగించుకొని పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా ఊరిలో శోభాయాత్రలో భాగంగా డీజే చప్పుల్లతో అలంకారప్రాయంగా మార్చి దేవిని ప్రధాన వీధిలో గుండా తిప్పడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. అయితే మధ్యాహ్నం చిన్న గొడవగా మారి చిలికి చిలికి గాలివానగా మరి చివరికి యువకులు గ్రామస్తులు మాల ధరించిన స్వాములు అందరూ కలిసి అమ్మవారికి ప్రధాన వీధిలో గుండా తప్పనిసరిగా డీజే చెప్పులతో నృత్యాలు చేస్తూ వెళ్తామని మహిళలు కూడా భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో పోలీసులు ఎంత నచ్చితే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కాన రాలేదు.

**స్తంభించిన ట్రాఫిక్....**

మధ్యాహ్నం 4 గంటల నుండి సాయంత్రం వరకు కొనసాగుతున్న ధర్నాలో అధిక సంఖ్యలో దుర్గామాత స్వాములు యువకులు గ్రామస్తులు మహిళలు పాల్గొనగా ఎంతకీ ఒప్పుకొని ఎస్సై చిన్న బాక్స్ తో పాటలు పెట్టుకుని వెళ్ళమని సూచించాడు కానీ అది మాకు సరిపోదని అమ్మవారిని అంగరంగ వైభవంగా ప్రధాన వీధులు ఊరి లో తిప్పుతూ తీసుకెళ్తామని భీష్మించుకొని కూర్చున్నారు. అప్పటికే డిఎస్పి కి స్థానిక ఎస్సై మహేందర్ పలుమార్లు ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితి చెప్పడం జరిగింది.

**ఎస్సై డౌన్ డౌన్ అంటూ నినాదాలు**

చిన్న బాక్స్‌కు అనుమతించడంపై స్థానిక ఎస్సై మహేందర్ ను ఆగ్రహించిన స్వాములు మహిళలు యువకులు ఎస్ఐ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అప్పటికే రాజకీయ నేతలు విడిసి సమక్షంలో అందరూ కలిసి గొడవ సద్దుమణి ఎందుకు చూసిన గ్రామస్తులు వినకపోవడంతో గ్రామస్తులంతా ఒక వైపు పోలీసు బలగాలు ఒకవైపుగా మారాయి. దీంతో ఎక్కడి ట్రాఫిక్ అక్కడ పూర్తిగా నిలిచిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

# కాచారంలో మైనింగ్ తవ్వకాలు తక్షణమే నిలిపివేయాలి

- ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా ప్రజల జీవితాలతో చెలగాటం
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- 11వ రోజు గ్రామస్తుల దీక్షకు సీపీఐ నాయకుల సంఘీభావం

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్న కాచారం మైనింగ్ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. దేవరకొండ మండల పరుధిలోని కాచారం గ్రామంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష గురువారం 11వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు సీపీఐ నాయకుల బృందం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మైనింగ్ కంపెనీలు అభివృద్ధి పేరుతో గ్రామస్తులకు ఆశలు కల్పించి ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థుల వ్యతిరేకత ఉన్నప్పటికీ తప్పుడు విధానాల్లో అనుమతులు పొందాయని ఆరోపించారు. పచ్చని పల్లెల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపడుతూ ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. 2022లో మైనింగ్ పనులు ప్రారంభించిన నవభారత్ కంపెనీ కాచారం గ్రామ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోలేదని, మైనింగ్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు రక్షణ చర్యలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. గ్రామానికి సమీపంలోనే నియంత్రణ లేకుండా బ్లాస్టింగ్ నిర్వహించడం వల్ల రైతులు భయాందోళనలకు గురవుతున్నారని, ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మైనింగ్ కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతోందని, దుమ్ము, కాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పిన కంపెనీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం విషయంలోనూ మైనింగ్ నిర్వాహకులపై ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మైనింగ్



కార్యకలాపాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. డిఎస్పి శ్రీనివాస్ రావు, సీఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నూనె రామస్వామి, పల్లా రంగారెడ్డి, గ్రామ సర్పంచ్ ముదిగొండ శ్యామలయ్య, అడ్వకేట్ సుందరయ్య, ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, నాయకులు అలమోని మల్లయ్య, కాటం గోవర్ధన్, శ్రీను, సైదులు తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ బలవన్మరణంపై సమగ్ర విచారణ

- బాధ్యులపై చట్టప్రకారం చర్యలు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం
- ఎస్పీ భరోసా

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** భద్రాచలంలోని గోదావరి లాడ్జిలో హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ బలవన్మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజ్‌ను తన కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుమార్తె తన తండ్రి మృతికి కారణమైన పరిస్థితులపై విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని కన్నీటిపర్యంతమవుతూ కోరారు. పద్మశాలి సంఘం నాయకులు సైతం నిష్పక్షపాత విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు**

వినతిపై స్పందించిన ఎస్పీ రోహిత్ రాజ్.. కేసును క్షుణ్ణంగా విచారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తామని



తెలిపారు. వారు ఏ స్థాయిలో ఉన్న చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, బాధ్యులుగా తేలిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వై.ఎస్. రావు, గుండు రవికుమార్, వేముల ప్రసాద్ బాబు, వేముల సతీష్, వేముల మధుకర్, ఇమంది ఉదయ్ కుమార్, పుట్టా శంకరయ్య, తోటకూర శ్రీనివాసరావు, పిండిపోలు కన్నయ్య, దోమల కిషోర్, బొమ్మ రామకిషోర్, దోమల ప్రవీణ్, పెగడ శంకర్, ఆడెపు నాగరాజు, రాగిణి వెంకటేశ్వర్లు, వేల శివ, వేల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న



**సూర్యాపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుస్తారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ, అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు కృషి చేశారని చెప్పారు. నిజాం పాలకుల ధాన్యాగారాలను కొల్లగొట్టి, ఆ ధాన్యాన్ని పేదలకు పంచిపెట్టేవారని పేర్కొన్నారు. ధనవంతులు, పెట్టుబడి దారులు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన పండుగ సాయన్న చిన్నతనం నుంచే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం సాగించి, పేదల పక్షాన నిలిచిన గొప్ప ప్రజా వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిసిఓ శ్రీరామ్, బీసీ సంఘ నాయకులు ఈదుల యాదగిరి కళా కరుణాకర్, కందుల రమేష్, చలమల నరసింహ, బూర మాల్సూర్ గౌడ్, వీరాచారి, డాక్టర్ కృష్ణ బంటు, తన్నీరు రాంప్రభువు, తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల ఆసుపత్రిని సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**చొప్పదండి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** చొప్పదండి పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మండపడగల ఆసుపత్రిని గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పరిశీలించారు ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ చొప్పదండి పట్టణ ప్రజలకు, నియోజకవర్గ ప్రజలందరికీ చొప్పదండిలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి రానున్నదని పేర్కొన్నారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే దృఢ సంకల్పంతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సాయశక్తులా కృషి చేసి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రూ. 37 కోట్ల 50 లక్షల నిధులతో శంకుస్థాపన చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు అన్ని



పనులు పూర్తయ్యాయి. కేవలం ఫర్నీచర్ రావాల్సి ఉందని, అది కూడా అతి త్వరలో వస్తుందని తెలిపారు. మున్సిపాలిటీ పాలకవర్గం పలుమార్లు ఆసుపత్రిని సందర్శించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి రాత్రింబవళ్లు అధికారులు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రి దామోదర రాజనర్సింహాతో సమన్వయం చేస్తూ కృషి చేశారని కొనియాడారు. ఆమె వెంట సింగిల్ విండో చైర్మన్ నిన్న మనోహర్, వైస్ చైర్మన్ నిజానపురం చందు, కౌన్సిలర్లు గుర్రం సుజిత్ రెడ్డి ,గుర్రం రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణ హరి, ఒలుగోతుల సురేష్ ,నాయకులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. సొసైటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సొసైటీ అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సేవలపై చర్చించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం, భవనాన్ని సందర్శించాలని ప్రతినిధులు కోరగా, త్వరలోనే కార్యాలయాన్ని సందర్శించి భవనాన్ని పరిశీలిస్తానని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ డాక్టర్ సీను నాయక్, ట్రెజరర్ కెంపుల నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రంజిత్ సింగ్, జగన్ మోహన్ గౌడ్, సభ్యులు కొండ సత్య ప్రసాద్, పద్మ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో కొనసాగుతున్న బీ.సీ స్టడీ సర్కిల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం సందర్శించారు. ఇది అద్దె భవనంలో కొనసాగుతుండడంతో తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని కలెక్టర్ నిశిత పరిశీలన జరిపారు. స్టడీ సర్కిల్ లో ఎంతమంది శిక్షణ పొందుతున్నారు, వారికి ఎలాంటి శిక్షణ అందిస్తున్నారు, ఎంతమందికి ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి, దీని నిర్వహణకు ప్రతీ నెల ఎంత మొత్తం వ్యయం అవుతోంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీ.సీ స్టడీ సర్కిల్ కు శాశ్వత ప్రాతిపదికన రూ. 3.65 కోట్లను వెచ్చిస్తూ పక్కా భవనం నిర్మాణం కోసం గంగాస్తాన్ లో 2016 లోనే శంకుస్థాపన చేసినప్పటికీ న్యాయపరమైన సమస్య కారణంగా పనులు చేపట్టలేకపోతున్నారని పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి గంగాస్తాన్ లో బీ.సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కోసం ఉద్దేశించిన స్థలాన్ని సైతం సందర్శించి పరిశీలించారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ సబ్ కలెక్టర్ సందీప్, ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయికుమార్, బీ.సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

# టీజీపీఎస్‌సీ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26వ తేదీలలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీ.బీ.టీ) విధానంలో పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్టు (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 24, 26 తేదీలలో జిల్లాలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో పరీక్షలు నిర్వహించనుండగా, పరీక్షా కేంద్రంలో సరిపడా కంపూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని కలెక్టర్ గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రంలో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అభ్యర్థులను లోనికి పంపాలని, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించకూడదని సూచించారు. నిర్ణీత సమయానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అభ్యర్థులకు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. మొదటి సెషన్ పరీక్షకు సంబంధించి ఉదయం 8.00 గంటల నుండే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని, నిమిషం ఆలస్యం అయినా అనుమతించబడరని తెలిపారు. సెకండ్ సెషన్ పరీక్షకు సంబంధించి మధ్యాహ్నం 12.30 గంటల నుండి లోనికి అనుమతించడం జరుగుతుందని, 2.00 గంటలకు గేట్లు మూసివేస్తారని కలెక్టర్ వెల్లడించారు. నిర్ణీత సమయం దాటిన మీదట ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి పంపడం జరుగదని అన్నారు. పరీక్షా సమయం ప్రారంభం అయిన మీదట ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం



నుండి ఎవరూ బయటకు వెళ్లకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఎగ్జామినేషన్ డ్యూటీలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన బంధువులు ఎవరూ పరీక్ష రాయడం లేదని వారి నుండి ధృవీకరణ పత్రం తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ సబ్ కలెక్టర్ సందీప్, ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, పరీక్షా కేంద్రం నిర్వాహకుడు అయూబ్, తహసిల్దార్ హరికిషోర్ తదితరులు ఉన్నారు.

# సమయపాలన పాటించని కార్యదర్శి

**ఉదయం పదకొండు గంటలైనా కార్యాలయానికి రాని వైనం**
**విధుల్లో పక్షపాతం చూపుతున్నారని ఆరోపణ**
**ఎంపీడీఓకు మాగి గ్రామ పంచాయతీ గ్రామస్తుల ఫిర్యాదు**
**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**నిజాంసాగర్(జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి గ్రామ పంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు సేవలు అందించడంలో పక్షపాతం చూపుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గురువారం ఉదయం 11:15 గంటలు దాటినా కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి హాజరు కాకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్యాలయానికి నిర్ణీత సమయానికి రావడం లేదని, దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సాధారణ ప్రజలు, పేదలు తమ సమస్యల పరిష్కారం కోసం, ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయానికి వస్తే అందుబాటులో ఉండకుండా తిప్పుకుంటున్నారని ఆరోపించారు. అదే సమయంలో కొందరికి మాత్రం పనులు త్వరగా చేసి పెడుతున్నారని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేశారువిధుల నిర్వహణలో నిర్లక్ష్యం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ విషయమై స్థానిక నాయకులు, బాధిత గ్రామస్తులు కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి (ఎంపీడీఓ) రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాగి గ్రామ పంచాయతీ కార్యదర్శి పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా ప్రజలకు అందాల్సిన సేవల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, సామాన్య ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా పర్యవేక్షణ పెంచాలని గ్రామస్తులు కోరారు.

# తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత



- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ
- వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక
- యాసంగిలో వరి సాగును ప్రోత్సహించవద్దు.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలి
- ప్రస్తుత ఖరీఫ్ పంటలను కాపాడేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి
- భూగర్భ జలాల పరిరక్షణ, కూరగాయల సాగు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, దైవ కృపతో జగిత్యాల జిల్లాలో తక్కువ నష్టాలతో 2026 ఖరీఫ్ సీజన్‌ను పూర్తి చేసుకునే పరిస్థితి ఉందని, ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో వర్షపాతం లోటు కూడా తక్కువగా ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే రానున్న ఎనిమిది నెలల్లో వర్షం పడకపోవచ్చనే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ), చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం కాపాడుకోవాలని స్పష్టం చేశారు. దక్షిణ తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా ఉన్నాయని, జగిత్యాల జిల్లాలోనూ నీటి వినియోగంపై ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను సాధ్యమైనంత వరకు కాపాడేందుకు మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. అవసరమైతే పొరుగు రైతుల బోర్ల నుంచి నీటిని అందించే అవకాశాలను పరిశీలించి, రైతుల మధ్య సమన్వయం కల్పించాలని తెలిపారు.రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, రైతులు ఎదుర్కొనే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు.యాసంగి పంటల ప్రణాళికను ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా పూర్తిగా సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి యాసంగి పంటలకు నీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేస్తూ, బోరు నీరు అందుబాటులో ఉన్నా వరి సాగుకు వెళ్లవద్దని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడితే పంటలను చివరి వరకు కాపాడటం కష్టమవుతుందని, అందువల్ల తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి మండలంలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి, గ్రామాల వారీగా యాసంగి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. తాగునీరు, పశువుల నీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, రాబోయే రోజుల్లో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా నీటి వనరులు, నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిని మండలాల వారీగా అంచనా వేసి ప్రణాళికలను సవరించాలని ఆదేశించారు.
స్ప్రింక్లర్ల కోసం రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు వివరాలతో నివేదిక సమర్పించాలని, ఈ అంశాన్ని ప్రభుత్వంతో పాటు సంబంధిత మంత్రితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చోట నీటి సరఫరాపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆఖేపల్లి ఆయకట్టు రైతుల ప్రస్తుత పంటలను రక్షించేందుకు ఒకసారి నీటిని విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

**ఉద్యాన పంటలు, కూరగాయల సాగును పెంచాలి**

ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు రైతులను ప్రోత్సహించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోతుల సమస్య ఉన్న ప్రాంతాల్లో సౌర విద్యుత్‌తో పనిచేసే ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సౌర ఫెన్సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్న విషయాన్ని రైతులకు వివరించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయల సాగును కూడా ప్రోత్సహించాలని ఆదేశించారు.

**నీటి నిల్వలు.. తాగునీటి సరఫరాపై అప్రమత్తత**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 36.269 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఇది 45.05 శాతమని కలెక్టర్ వివరించారు. అక్టోబర్ 10 నుంచి 20 వరకు వరి పంటలకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. వేసవి తాగునీటి అవసరాల కోసం సుమారు 36 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అధికారులు యాసంగి సాగు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. వ్యవసాయ శాఖ ఇప్పటికే యాసంగిలో రెండు లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని ప్రతిపాదించిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ లక్ష్యాన్ని ఎలా సాధిస్తారో సమీక్షించుకోవాలని సూచించారు. చెరువులు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, ఎస్ఆర్ఎస్పీ నుంచి నీటి విడుదల ఉండదని పేర్కొంటూ, ఈ పరిస్థితుల్లో వరి సాగును ప్రోత్సహించకూడదని స్పష్టం చేశారు. యాసంగిలో కనీసం 10 ఎకరాల్లో కూడా వరి సాగును ప్రోత్సహించకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, (ఎంఆర్ఓలు), వ్యవసాయ అధికారులు (ఏఓలు), ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నాటకాలు

**హక్కుల పరిరక్షణకు టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కట్టుబడి ఉన్నాయి**
**: హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్**

**గోదావరిఖని(జనంసాక్షి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరి ఒకే విధంగా ఉందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ విమర్శించారు. కార్మికుల సమస్యలపై ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, కార్మికుల పట్ల తమకు ఎంతో ప్రేమ ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, కానీ వాస్తవంగా కార్మికుల ప్రయోజనాల కోసం ఎంతవరకు కృషి చేస్తున్నారనే విషయం ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. “నేను తిట్టినట్టు చేస్తా.. నువ్వు కొట్టినట్టు చెయ్యి” అన్న చందంగా ఈ రెండు పార్టీల వ్యవహారశైలి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపకుండా, పరస్పర విమర్శలతో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించడం సరికాదని అభిప్రాయపడ్డారు.సింగరేణి కార్మికులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు నిజమైన ప్రేమ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాలని, వారి ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరిలో పెద్దగా తేడా లేదని విమర్శించిన రియాజ్ అహ్మద్, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. కార్మికులకు సంబంధించిన సమస్యలపై ప్రశ్నించడం, వారి హక్కుల కోసం పోరాడటం, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన నూతన కమిటీని రియాజ్ అహ్మద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులుగా ఆరేళ్ల పోశం, స్పోక్స్ పర్సన్ గా పల్లి క్రాంతి కుమార్, జనరల్ సెక్రెటరీగా దూత రామ్మోహన్, యూత్ ప్రెసిడెంట్ గా శ్రీకాంత్ రెడ్డి, స్టూడెంట్ వింగ్ పట్ట అక్షయ్, బిసి వింగ్ ప్రెసిడెంట్ గా లి కిరణ్, రామగుండం కార్పొరేషన్ ఎస్సీ వింగుకు దుర్గం శ్రీనివాస్, ముస్లిం మైనార్టీ వింగుకు ఎం. ఏ .ఖయ్యూం, వుమెన్ వింగ్కు వెంచాల ధనలక్ష్మి, ఎస్టి వింగుకు జార్కుల వినోద్, 8వ ఇంక్లైన్ టౌన్ యూత్ ప్రెసిడెంట్ గా రవికుమార్ తదితరులను నియమించినట్లు రియాజ్ అహ్మద్ తెలిపారు.






# మిల్లర్ల ఇష్టరాజ్యం.. అన్నదాతలకు అన్యాయం

**రైస్‌మిల్ సిండికేట్‌ను వ్యతిరేకిస్తున్న రైతులు**

**ముస్తాబాద్ అక్టోబర్ 22 (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండల నామాపూర్ గ్రామ శివారులో ఉన్నటువంటి రైస్ మిల్ మిల్లర్ల యజమానులు రైతులను నిలువెల్ల మోసం చేస్తూ అందినంత దండుకుంటూ అని ఆరోపణ , ప్రభుత్వ యంత్రాంగా మాత్రం పట్టించుకోవడంలేదని రోడ్డుకి ధాన్యం కొనుగోలు పై రోడ్డు కెక్కిన రైతులు, రైస్ మిల్లు సిండికేట్ ను వ్యతిరేకిస్తున్న రైతులు, రైస్ మిల్ యజమానులు 2250,లకు కొనుగోలు చేయడం జరిగింది . దొడ్డు రకం, సన్నం రకం వడ్లకు 2750 , ధర ఇచ్చారు, పదిహేను రోజుల తర్వాత వడ్లు ఎక్కువగా తెచ్చేసరికి రైతులకు ఇప్పుడు మండలంలో ఉన్నటువంటి రైస్ మిల్ నిర్వాకులు అంత ధర మేము పెట్టలేమంటూ ఒక్కొక్క మిల్లుకు ఒక్కొక్క రకంగా తక్కువ ధరకు తీసుకుంటు రైతులను మోసం చేస్తున్నారు. అని ఆరోపణ చేస్తున్నారు. రైస్ మిల్ యజమానులు అందినంత దండుకుంటున్నారు. వెంటనే వివిధ గ్రామాల రైతులు రోడ్డు కెక్కి బాలాజీ రైస్ మిల్ టర్నింగ్ రోడ్డుపై దాదాపు గడ్డపైన ధర్నా నిర్వహించారు. వెంటనే స్థానిక ఎస్సై జ్యోతి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను ఎంత చెప్పిన వినకపోవడంతో వెంటనే రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై అధికారి రజిత, సత్యనారాయణ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో రైస్ మిల్ యజమానులతో మాట్లాడి ధర్నాను శాంతింప చేశారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఈ గతి మాకు పడేదా. రైస్ మిల్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదా. దాదాపు నెల రోజులు కావస్తున్న రైతులను పట్టించుకోవడం లేదు ప్రభుత్వ అధికారులు సివిల్ సప్లై అధికారులు గానీ. పండించిన ధాన్యాన్ని ఎవరికి కొనుగోలు చేయాలో రైతులకు తోసక రైస్ మిల్ యజమాని వద్దకు వెళితే అందినంత దండుకుంటూ రైతులను మోసం చేస్తున్నారు. రైతులు అంటున్నారు. వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యం

**కమలాపూర్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్.ఎంపై సస్పెన్షన్ వేటు**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అమర్ సింగ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. 2026 సెప్టెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు పలు వార్తా పత్రికల్లో ప్రచురితమైన కథనాలతో పాటు సంబంధిత అధికారులకు అందిన ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్, ఈ ఉదంతంపై విచారణ జరిపించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం చోటుచేసుకున్నట్లు వెల్లడి కాగా, విచారణ నివేదిక ఆధారంగా, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని ఇంచార్జి హెచ్.ఎం అమర్ సింగ్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రయోజనాల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయండి

**ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసిన చీకోడ్ సర్పంచ్**



**ముస్తాబాద్ అక్టోబర్ 22 (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామ సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు తెలంగాణ భవన్లో మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. గ్రామంలోని పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కేటీఆర్ ను కోరినట్లు తెలిపారు. కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ ఆంజనేయులు తెలిపారు.

# బడుగుల కోసం సాయన్న పోరాటం స్ఫూర్తిదాయకం

- సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- విద్యతోనే భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు:
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** అణగారిన, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పండుగ సాయన్న ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే. ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంత్ రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడిన ధీరుడని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచిన ఆయన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆ యన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, భూస్వాములు, జమిం దార్ల ఆగడాలు కొనసాగిన కాలంలోనే బడుగు బలహీన వర్గాల కోసం పండుగ సాయన్న చేసిన పోరాటం గొప్పదని అన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలని సూచించారు. విద్య ద్వారానే అన్ని రంగాల్లో రాణించడం సాధ్యమవుతుందని, బాలబాలికలందరికీ నాణ్యమైన విద్య అందించి వారి హక్కులను సాధించు కునేలా ప్రోత్సహించాలని కోరారు. మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలనే ఉద్దేశంతో ప్రభు త్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సాయికుమార్, నుడా చైర్మన్ కేశ వేణు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, బి. రామకృష్ణ, ముది రాజ్ సంఘం ప్రతినిధులు కే. రమేష్, మెతుకు శివ, రవిరాజ్, నారాయణ, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలి

**క్రాప్‌హాలిడే ప్రకటిస్తే ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి**

- నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి
- బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు
- ఎంపీ అర్వింద్ సంపూర్ణ మద్దతు




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):రైతాంగానికి సాగునీరు అందించడంతో పాటు వ్యవసాయానికి రోజుకు కనీసం 8 గంటల పాటు నిరంతర నాణ్యమైన త్రీ–ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడైనా క్రాప్ హాలిడే ప్రకటిస్తే,రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ తీర్మానాలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ సంపూర్ణ మద్దతు తెలపగా, జిల్లా కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందూర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న తాగునీరు, సాగునీటి సమస్యలు, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రజా సమస్యలపై జిల్లా అధ్యక్షుడు పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. వాటికి ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరత ఏర్పడి రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, విద్యుత్ కోతలు, లో–వోల్టేజీ సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే, నీటి కొరత కారణంగా రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం అందించాలని తీర్మానించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 27వ తేదీన దీక్ష కార్యక్రమం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గద్దె భూమన్న, భరత్ రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నగ్గోల్ల లక్ష్మీనారాయణ, నిమ్మల శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, జ్యోతి, బంటు రాము, నక్క రాజేశ్వర్, బద్దం కిషన్, జిల్లా పదాధికారులు, మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# చివరిబిల్లులకు మోక్షమెప్పుడో ?

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎదురుచూపులే!**




**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. పండుగ వేళ తమ సొంత ఇంటి కల నెరవేరుతుందని భావించినప్పటికీ, ఇళ్ల మంజూరుపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.**

- ఉచిత ఇసుక.. రాయితీ సిమెంట్ ఎక్కడ?
- ప్రభుత్వ హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి

**గంభీరావుపేట (జనంసాక్షి):**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు సమస్యలు తప్పడం లేదు. గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు చివరి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం అందిస్తామని ప్రకటించిన ఉచిత ఇసుక, రాయితీ సిమెంట్ అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చివరి బిల్లుల కోసం ఎదురుచూపులు**

ఇందిరమ్మ ఇళ్ల తొలి జాబితాలో స్థానం పొంది ఇళ్ల నిర్మాణానికి అనుమతి పొందిన కొందరు లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించి బేస్‌మెంట్ స్థాయిని పూర్తి చేశారు. అయితే, తదుపరి నిర్మాణ పనులకు అవసరమైన నిధులు, బిల్లుల విషయంలో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడం కష్టంగా మారిందని వాపోతున్నారు.

**ఉచిత ఇసుక ఏది?**

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా పది ట్రాక్టర్ల ఇసుక అందిస్తామని ప్రకటించినప్పటికీ, తమకు ఇంతవరకు ఇసుక అందలేదని కొందరు లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో బయట మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ. 6 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఇల్లు నిర్మించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో ఇసుక కోసం అదనపు భారం పడుతోందని అంటున్నారు.

**రాయితీ సిమెంట్ ఎక్కడ?**

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కొరకు జిల్లా కలెక్టర్ సిమెంటుపై రాయితీ అందుతుందని చెప్పినప్పటికీ అది అమలు కాకపోవడం సిమెంట్‌ను రాయితీపై లేదా జీఎస్టీ భారం లేకుండా అందిస్తారన్న హామీ అమలుపై కూడా లబ్ధిదారులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు భారంగా మారుతోందని పేర్కొంటున్నారు.

**అధికారులు స్పందించాలి**

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయడంతో పాటు ఉచిత ఇసుక, సిమెంట్ రాయితీకి సంబంధించిన వివరాలను స్పష్టం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన సదుపాయాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అన్నదాతలకు అన్యాయం... మిల్లర్ల ఇష్టరాజ్యం

**రైస్ మిల్ సిండికేట్ ను వ్యతిరేకిస్తున్న రైతులు**



**ముస్తాబాద్ అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల నామాపూర్ గ్రామ శివారులో ఉన్నటువంటి రైస్ మిల్ మిల్లర్ల యజమానులు రైతులను నిలువెల్ల మోసం చేస్తూ అందినంత దండుకుంటూ అని ఆరోపణ, ప్రభుత్వ యంత్రాంగా మాత్రం పట్టించు కోవడంలేదని రోడ్డుకి ధాన్యం కొనుగోలు పై రోడ్డు కెక్కిన రైతులు, రైస్ మిల్లు సిండికేట్ ను వ్యతిరేకిస్తున్న రైతులు, రైస్ మిల్ యజమానులు 2250,లకు కొనుగోలు చేయడం జరిగింది . దొడ్డు రకం, సన్నం రకం వడ్లకు 2750 , ధర ఇచ్చారు, పదిహేను రోజుల తర్వాత వడ్లు ఎక్కువగా తెచ్చేసరికి రైతులకు ఇప్పుడు మండలంలో ఉన్నటువంటి రైస్ మిల్ నిర్వాకులు అంత ధర మేము పెట్టలేమంటూ ఒక్కొక్క మిల్లుకు ఒక్కొక్క రకంగా తక్కువ ధరకు తీసుకుంటు రైతులను మోసం చేస్తున్నారు. అని ఆరోపణ చేస్తున్నారు. రైస్ మిల్ యజమానులు అందినంత దండుకుంటున్నారు. వెంటనే వివిధ గ్రామాల రైతులు రోడ్డు కెక్కి బాలాజీ రైస్ మిల్ టర్నింగ్ రోడ్డుపై దాదాపు గడ్డపైన ధర్నా నిర్వహించారు. వెంటనే స్థానిక ఎస్సై జ్యోతి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను ఎంత చెప్పిన వినకపోవడంతో వెంటనే రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై అధికారి రజిత, సత్యనారాయణ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో రైస్ మిల్ యజమానులతో మాట్లాడి ధర్నాను శాంతింప చేశారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఈ గతి మాకు పడేదా. రైస్ మిల్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదా. దాదాపు నెల రోజులు కావస్తున్న రైతులను పట్టించుకోవడం లేదు ప్రభుత్వ అధికారులు సివిల్ సప్లై అధికారులు గానీ. పండించిన ధాన్యాన్ని ఎవరికి కొనుగోలు చేయాలో రైతులకు తోసక రైస్ మిల్ యజమాని వద్దకు వెళితే అందినంత దండుకుంటూ రైతులను మోసం చేస్తున్నారు. రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ మైనార్టీ విభాగం వినతిపత్రం**



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** భారతరత్న, భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నవంబర్ 11న నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రభుత్వ ఖర్చుతో ఘనంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ ముహమ్మద్ తాజుద్దీన్ గురువారం రోజు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. గతంలో 2004 నుండి 2014 వరకు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవాన్ని సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే లు సామాజిక, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రసంగాలతో ఘనంగా నిర్వహించేవారని 2015 నుండి 2023 వరకు ఉన్న తెరాస ప్రభుత్వం మౌలానా జయంతి ని చాలా తగ్గించిందని ముహమ్మద్ తాజుద్దీన్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, విద్యాభివృద్ధికి విశేష సేవలందించారని తెలిపారు. ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయడానికి, విద్యా ప్రాధాన్యతను, జాతీయ సమైక్యతను, మత సామరస్యాన్ని ప్రజల్లో పెంపొందించడానికి ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. రానున్న నవంబర్ 11న కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే చేపట్టి, గతంలో మాదిరిగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలతో కూడిన వేడుకలను నిర్వహించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఏ. మొసిన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్, అహ్మద్ అలీ సిటీ కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్, సీనియర్ నాయకులు నెహాల్ అహ్మద్, అబ్దుల్ రహేమాన్ కలీముద్దీన్, ముహమ్మద్ అమీర్, ఎం.ఏ. జమీల్, అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.




# కార్మికుల సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకం

- కార్మికుల హక్కుల పరిరక్షణకు టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కట్టుబడి ఉన్నాయి
- హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ విమర్శలు
- రామగుండం కార్పొరేషన్‌కు నూతన కమిటీ ప్రకటన

**గోదావరిఖని, అక్టోబర్ 22 (జనంసాక్షి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరి ఒకేలా ఉందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ విమర్శించారు. కార్మికుల సమస్యలపై పరస్పరం విమర్శలు చేసుకుంటూ, వారి సంక్షేమం పట్ల తమకు ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో పనిచేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నించడం సరికాదన్నారు.
గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "నేను తిట్టినట్టు చేస్తా.. నువ్వు కొట్టినట్టు చెయ్యి" అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్మికుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాలని, హామీలకే పరిమితం కాకుండా వాటి అమలుకు కృషి చేయాలని కోరారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. అనంతరం టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన రామగుండం కార్పొరేషన్ నూతన కమిటీ వివరాలను రియాజ్ అహ్మద్ వెల్లడించారు. కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఆరేళ్ల పోశం, అధికార ప్రతినిధిగా పల్లి క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా దూత రామ్మోహన్, యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగానికి పట్ట అక్షయ్, బీసీ విభాగం అధ్యక్షుడిగా కిరణ్, ఎస్సీ విభాగానికి దుర్గం శ్రీనివాస్, ముస్లిం మైనారిటీ విభాగానికి ఎం.ఏ. ఖయ్యూం, మహిళా విభాగానికి వెంచాల ధనలక్ష్మి, ఎస్టీ విభాగానికి జార్కుల వినోద్, 8వ ఇంక్లైన్ టౌన్ యువజన అధ్యక్షుడిగా రవికుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- **వరి సాగుకు దూరంగా ఉండాలి.. తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలి**
- **కేశవపట్నం రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ అవగాహన : ఏడిఏ శ్రీధర్**



**శంకరపట్నం అక్టోబర్ 22 జనంసాక్షి :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించిన 'ఖేత్ బచావో అభియాన్'లో భాగంగా కేశవపట్నం రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానకొండూరు ఏడీఏ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నీటి సంరక్షణ, పంటల పరిరక్షణ, నేల ఆరోగ్యం, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలను వివరించారు. వర్షాలు, నీటి లభ్యతపై అనిశ్చితి ఉన్న పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ కాలపరిమితిలో చేతికొచ్చే, తక్కువ నీటితో పండించే అపరాలు, నూనెగింజలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకునే చర్యలు చేపట్టాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని నష్టాల బారిన పడకుండా ఉండవచ్చని వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, సాగు పరిస్థితులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం వ్యవసాయ అధికారి వెంకటేష్, హుజూరాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, ఏఈఓలు స్రవంతి, కీర్తన, సునంద, ఆరతి, అర్చనతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎదురుచూపులే!

- చివరి బిల్లులు ఎప్పుడు వస్తాయో?
- ఉచిత ఇసుక ఏది? రాయితీ సిమెంట్ ఎక్కడ?
- ప్రభుత్వ హామీలు అమలు చేయాలని లబ్ధిదారుల విజ్ఞప్తి
- దసరా కానుకగా ఇళ్లు వస్తాయని ఆశ.. నిరాశే మిగిలిందని ఆవేదన

**గంభీరావుపేట, అక్టోబర్ 21 జనం సాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. పండుగ వేళ తమ సొంత ఇంటి కల నెరవేరుతుందని భావించినప్పటికీ, ఇళ్ల మంజూరుపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు సమస్యలు తప్పడం లేదు. గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు చివరి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం అందిస్తామని ప్రకటించిన ఉచిత ఇసుక, రాయితీ సిమెంట్ అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**చివరి బిల్లుల కోసం ఎదురుచూపులు**

ఇందిరమ్మ ఇళ్ల తొలి జాబితాలో స్థానం పొంది ఇళ్ల నిర్మాణానికి అనుమతి పొందిన కొందరు లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించి బేస్‌మెంట్ స్థాయిని పూర్తి చేశారు. అయితే, తదుపరి నిర్మాణ పనులకు అవసరమైన నిధులు, బిల్లుల విషయంలో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడం కష్టంగా మారిందని వాపోతున్నారు.

**ఉచిత ఇసుక ఏది?**

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా పది ట్రాక్టర్ల ఇసుక అందిస్తామని ప్రకటించినప్పటికీ, తమకు ఇంతవరకు ఇసుక అందలేదని కొందరు లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో బయట మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ.6 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఇల్లు నిర్మించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో ఇసుక కోసం అదనపు భారం పడుతోందని అంటున్నారు.

**రాయితీ సిమెంట్ ఎక్కడ?**

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కొరకు జిల్లా కలెక్టర్ సిమెంటుపై రాయితీ అందుతుందని చెప్పినప్పటికీ అది అమలు కాకపోవడం సిమెంట్‌ను రాయితీపై లేదా జీఎస్టీ భారం లేకుండా అందిస్తారన్న హామీ అమలుపై కూడా లబ్ధిదారులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు భారంగా మారుతోందని పేర్కొంటున్నారు.

**అధికారులు స్పందించాలి**

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయడంతో పాటు ఉచిత ఇసుక, సిమెంట్ రాయితీకి సంబంధించిన వివరాలను స్పష్టం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన సదుపాయాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడాలి

- ఖేతి బచావో అభియాన్ శిక్షణలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలి
- ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం
- రైతులకు అందుబాటులో విత్తనాలు.. కనీస మద్దతు ధరకు కొనుగోళ్లకు ఏర్పాట్లు



**జమ్మికుంట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖేతి బచావో అభియాన్ శిక్షణ, కపాస్ కాంతి యాప్ ద్వారా పత్తి కొనుగోలు కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లాలోని 45 రైతువేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా, జమ్మికుంట మండలం ఆబాది జమ్మికుంట రైతువేదికలో అదనపు కలెక్టర్ పాల్గొని ఖేతి బచావో శిక్షణను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత విప్లవంతో దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిందని తెలిపారు. ప్రస్తుతం సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటిస్తూ ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును సాధ్యమైనంత తగ్గించి, పెసర, మినుము, కుసుమ, నువ్వులు, పొద్దుతిరుగుడు, శనగ, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. చత్రు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను రైతులు పాటించాలని, రైతు రిజిస్ట్రీ చేసుకున్న వారికి పెసర, మినుము, కుసుమ, మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు, వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)పై పంటల కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉందని, ధర తగ్గినప్పుడు సీసీఐకి విక్రయించవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు భూమి ఆరోగ్య పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న మాట్లాడుతూ రైతులు పంటలను తక్కువ ధరకు విక్రయించకుండా, నాణ్యమైన దిగుబడులను మార్కెట్ కమిటీలో ఎంఎస్‌పీకి అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా వీరుడు.. పండుగ సాయన్న

**కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు**

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 22(జనంసాక్షి) :** నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ 'పండగ సాయన్న' జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజాం ప్రభువుల ధాన్యం కారాగాన్ని కొలగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అని అన్నారు. ధనవంతుల నుండి, పెట్టు బడుదారుల వ్యవస్థ నుండి భూస్వాముల నుండి, అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారి పై తిరుగుబాటు చేశాడన్నారు.

తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఏ ఓ కిషన్, సిబ్బంది , బీసీ సంఘాల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



# పేదలకు సీఎం సహాయనిధి అండ

**111 మంది లబ్ధిదారులకు రూ.52.04 లక్షల చెక్కుల పంపిణీ**

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 22 (జనం సాక్షి):** జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు జిల్లా పార్టీ కార్యాలయంలో జగిత్యాల పట్టణానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ గారు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గారు మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. చికిత్స ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఖఎఎ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి పాక్స్ చైర్మెన్ దామోదర్ రావు మాజీ మున్సిపల్ ఛైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్ జూఎఎ సెక్రటరీ బండ శంకర్ గట్టు సతీష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక

- తాగునీటికి తొలి ప్రాధాన్యం.. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే మేలు
- వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలపై కార్యాచరణ
- వరి సాగును ప్రోత్సహించొద్దు.. రైతులకు అవగాహన కల్పించాలి
- భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి
- కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి




**జగిత్యాల బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పశువుల అవసరాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని సూచించారు. బుధవారం జగిత్యాల ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు.
జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ పంటలను కాపాడేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట ఇతర రైతుల బోర్ల నుంచి నీటిని అందించే అవకాశాలను పరిశీలించి సమన్వయం చేయాలన్నారు. ఎస్సారెస్పీ నుంచి యాసంగి పంటలకు నీరు విడుదల చేసే అవకాశం లేనందున వరి సాగును ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. తక్కువ నీటితో, స్వల్పకాలంలో చేతికొచ్చే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సాగు ప్రణాళికలు రూపొందించి, తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.
కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును విస్తరించి రైతుల ఆదాయం పెంచాలని మంత్రి సూచించారు. కోతుల బెడద ఉన్న ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటుపై అవగాహన కల్పించాలన్నారు. వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జి, నీటి సంరక్షణ పనులు చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
జిల్లాలో సాధారణం కంటే 11 శాతం వర్షపాతం లోటు నమోదైందని కలెక్టర్ బి.సత్యప్రసాద్ వివరించారు. 20 మండలాల్లో అక్టోబర్ 22 వరకు వర్షపాతం నమోదు కాలేదని, ఏడు మండలాల్లో లోటు వర్షపాతం ఉందని తెలిపారు. జిల్లాలో 4.20 లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగు కాగా, 3.02 లక్షల ఎకరాల్లో వరి వేశారు. సుమారు 3,107 ఎకరాల్లో పంటలు నీటి ఒత్తిడికి గురయ్యాయని, 97 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయిందని వివరించారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా రైతులకు సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. యాసంగి 2026-27లో కూరగాయల సాగును 263 ఎకరాల నుంచి 563 ఎకరాలకు, ఆయిల్‌పామ్ సాగును 152 ఎకరాల నుంచి 1,019 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 36.269 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, వేసవి తాగునీటి అవసరాల కోసం తగిన నిల్వలు ఉంచేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే జూన్ వరకు నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని యాసంగి సాగు ప్రణాళికను సవరించాలని సూచించారు. చెరువుల్లో నీటిని వరి సాగుకు వినియోగిస్తే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకునేలా రైతులతో చర్చించాలని, కాలువల్లో పూడిక తొలగింపు, నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పశువులకు నీరు, మేత అందుబాటులో ఉంచడంతోపాటు సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సింగరేణి ఆర్జీ.1 ఏరియా సహకారంతో..

# మహిళలకు ఉద్యోగ అవకాశాలకు ఆహ్వానం

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం ఏరియా-1 జియం ఆదేశాల మేరకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ ఉద్యోగాలలో పని చేయడానికి ( మహిళలకు మాత్రమే)అర్హత 10 పాస్/ఇంటర్/డిగ్రి ఆపైన, 40 సంవత్సర లోపు వయస్సు ఉన్న యువతులు, మహిళలకు అవకాశం ఉంటుందని ఆర్జీ.వన్ జీఎం డీ. లలిత కుమార్ తెలిపారు. యువతులు, మహిళలకు 100% భద్రత కల్పిస్తామన్నారు. ఎంపికైన వారి నెలకు జీతం రూ.20, 000/- ఇవ్వనున్నవని తెలిపారు. వసతి, ఉచిత భోజనం, ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 24 (శనివారం)లోగా రామగుండం ఏరియా.1 స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్, తిలక్ నగర్, గోదావరిఖనిలో ధరఖాస్తులు పెట్టుకోవాలని జిఎం సూచించారు. మరిన్ని వివరాలకు 9494313794, 8792610210 సంప్రదించాలని సింగరేణి అధికార ప్రతినిధి కోరారు.

# ముస్తాబాద్ పెద్ద చెరువును పరిశీలించిన డ్యామ్ సేఫ్టీ ఎక్స్పర్ట్ కమిటీ అధికారులు



**ముస్తాబాద్ అక్టోబర్ 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పెద్ద చెరువు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ రామారావు ప్రత్యేక కృషితో సుమారు 7 కోట్లతో భారీ వర్షాలకు తగిన చెరువు కట్ట రిపేర్‌తో పాటు చెరువు కట్టను ఆధునికరించారు ప్రస్తుతము చెరువులో సగం వరకు నీరు ఉంది గురువారము చెరువును నీటిపారుదల విశ్రాంత సీఈ శ్రీకాంత్ రావు, డ్యామ్ సేఫ్టీ ఎక్స్పర్ట్ కమిటీ చైర్మన్ విజయ్ త్రిమ్బగ్ దేశాయ్, ఈఈ ప్రశాంత్, శ్రీకాంత్ మెకానికల్ ఎక్స్పర్ట్, ఎస్ఈ రమేష్, ఏఈలు నవీన్ తదితరులు పాల్గొన్నారు



## నార్సింగి సర్కిల్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

**రాజేంద్రనగర్,అక్టోబర్22(జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నార్సింగి సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. చిత్రపురి కాలనీలో మోడల్ రోడ్డు, ఫుట్‌పాత్ నిర్మాణం, వరలక్ష్మి టిఫిన్స్ సమీపంలోని పార్కు అభివృద్ధి, సెంట్రల్ మీడియన్‌లో ఆర్‌సీసీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి, ఈఈ శిరీష, డీఈలు కార్తిక్, అన్వేష్ రెడ్డి, ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో లిఫ్టుల సమస్య పరిష్కరించాలి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి, కాప్రా తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పనిచేయని లిఫ్టులకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో హౌసింగ్ ఎండీ గౌతమ్ (ఐఏఎస్)ను కలిసి సమస్యను వివరించారు. లిఫ్టులు పనిచేయక వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను గుర్తించి, లిఫ్టుల మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

## అనుమతుల్లేకుండా డీజేలు.. మూడు వాహనాలు సీజ్

**నిజాంసాగర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నర్వ గ్రామంలో అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసిన ఘటనలో పోలీసులు మూడు డీజే వాహనాలను సీజ్ చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులతో పాటు వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. అక్టోబర్ 21న రాత్రి 7 గంటల సమయంలో నర్వ గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు డీజే స్పీకర్లను తొలగించాలని నిర్వాహకులకు సూచించారు.





# మాదారంలో మద్యం విక్రయాలు నిలిపివేయండి

- ఎమ్మెల్యే యాదయ్య కాళ్లు పట్టుకుని వేడుకున్న మహిళలు
- కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలపై గ్రామస్తుల ఫిర్యాదు
- తక్షణ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు
- వారం రోజుల్లో మద్యం విక్రయాలు నిలిపివేస్తామని పోలీసుల హామీ

**నవాబుపేట్, అక్టోబర్ 23 (జనంసాక్షి):** "సారూ.. మా గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయండి.. మీ కాళ్లు మొక్కుతాం" అంటూ మాదారం గ్రామ మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. కిరాణా దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని, దీంతో తమ కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి మద్యం విక్రయాలను అరికట్టాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వికారాబాద్ ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నవాబుపేట్ మండలం మాదారం గ్రామంలో గత రెండు నెలలుగా నాలుగు కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని మహిళలు ఆరోపించారు. మద్యం తాగి ఇంటికి వస్తున్న భర్తలు కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని తెలిపారు. మద్యం అమ్మకాలను ప్రశ్నిస్తే దుకాణదారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ ముష్టి లలిత ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, మద్యం విక్రయాలు నిలిపివేయాలని తీర్మానించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతూ మహిళలు నవాబుపేట్ తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఐదేళ్లపాటు గ్రామంలో మద్యం విక్రయాలు నిలిచిపోవడంతో కుటుంబాలు ప్రశాంతంగా ఉన్నాయని, మళ్లీ అమ్మకాలు ప్రారంభం కావడంతో సమస్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలను కాపాడేందుకు గ్రామంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ఎమ్మెల్యే యాదయ్య ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎస్సై గిరి హామీ ఇచ్చినట్లు మహిళలు తెలిపారు. వారం రోజుల్లో గ్రామంలో మద్యం విక్రయాలను నిలిపివేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. కార్యక్రమంలో సర్పంచ్ ముష్టి లలిత ప్రభాకర్, ఉపసర్పంచ్ ఆవలి రాములమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సిద్దిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి.. తోపులాటలో డీఆర్‌డీఓ ఉద్యోగి మృతి

- యువతిని వేధించాడనే ఆరోపణలతో ఘర్షణ
- నిలదీసిన క్రమంలో కిందపడి తలకు తీవ్ర గాయం
- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు.. పరారీలో అభిజిత్

**ముషీరాబాద్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** యువతిని వేధించాడనే ఆరోపణల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో డీఆర్‌డీఓ ఉద్యోగి రామ్మోహన్ నాయుడు (55) మృతి చెందాడు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి లైన్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం జరిగిన తోపులాటలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. అపార్ట్‌మెంట్‌లోని పై అంతస్తులో నివసించే యువతిని రామ్మోహన్ నాయుడు గత కొంతకాలంగా అసభ్యంగా తాకుతూ వేధిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. బుధవారం కూడా ఆయన అసభ్యంగా ప్రవర్తించాడని యువతి అభ్యంతరం వ్యక్తం చేసింది. అనంతరం పక్క ఫ్లాట్‌లో నివసించే అభిజిత్‌కు విషయం చెప్పడంతో ఇద్దరూ కలిసి రామ్మోహన్ నాయుడిని నిలదీశారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది. అభిజిత్ తోసివేయడంతో రామ్మోహన్ నాయుడు కిందపడి తలకు తీవ్ర గాయమైందని పోలీసులు తెలిపారు. గాయపడిన రామ్మోహన్ నాయుడిని కాచిగూడలోని సీసీ షరాఫ్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య కాత్యాయని ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. యువతిని వేధించారనే ఆరోపణలు, ఘర్షణకు దారితీసిన పరిస్థితులు, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. అభిజిత్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

## డంపింగ్ యార్డు సమస్యపై ఎంపీ ఈటలతో చర్చ

- చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నేతల మర్యాదపూర్వక భేటీలు
- ప్రజల్లో అవగాహనకు పాదయాత్రలు చేపట్టాలని సూచన



**కీసర, అక్టోబర్ 21 (జనంసాక్షి):** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొదట రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి డంపింగ్ యార్డు సమస్యపై చర్చించారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మేడ్చల్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించాలని ఈటల సూచించినట్లు నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్‌గౌడ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, నక్క కిషోర్‌గౌడ్, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి నరేశ్, మహిళా నాయకురాలు జ్యోతి పాండే, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమర పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం

- కుటుంబ సభ్యులకు నియామక ఉత్తర్వుల కాపీ అందజేత
- అందించిన పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య
- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** విధి నిర్వహణలో అమరుడైన పోలీస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వుల కాపీని గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య కుటుంబ సభ్యులకు అందజేశారు.
2025లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబాన్ని ఆదుకునే చర్యల్లో భాగంగా, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన కుటుంబ సభ్యురాలు ప్రణీతకు ప్రభుత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. అందులో భాగంగా కమిషనర్ కార్యాలయంలో ఉత్తర్వుల కాపీని అందించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ సేవలను స్మరించుకున్న పోలీస్ కమిషనర్.. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను శాఖ ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. దేశం, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు.

### బతుకమ్మను అడ్డుకున్న వైనం..

## ఐదు రోజులుగా పెద్దమ్మ గుడి వద్దే బతుకమ్మ!



**గన్నేరువరం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండలం చాకలివానిపల్లె గ్రామ పరిధిలోని కూనవానిపల్లె లో సంచలన ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం, కూనవానిపల్లెకు చెందిన కూన భారతి, భర్త మల్లయ్య కుటుంబం ఆదివారం బతుకమ్మ పండుగ రోజు బతుకమ్మను పేర్చి పెద్దమ్మ గుడి వద్దకు తీసుకెళ్లగా, గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుని అవమానించి కుల బహిష్కరణకు పాల్పడ్డారని ఆరోపణ. అవమానంతో బాధిత కుటుంబం బతుకమ్మను అక్కడే వదిలి వెళ్లిపోగా, ఆదివారం పెట్టిన బతుకమ్మ గురువారం వరకు ఐదు రోజులుగా నిమజ్జనం కాకుండా అలాగే ఉండటంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

**భూ వివాదం కక్షగా వేధింపులు:**

కొద్దిరోజుల క్రితం భూ వివాదం పెద్దల సమక్షంలో పరిష్కారమైనా, ఇప్పటికీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పండుగ రోజు కూడా వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ ఘటనపై సోమవారం గన్నేరువరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మీడియా కథనానికి స్పందించిన పోలీసులు: ఈ ఘటనపై మీడియా కవరేజ్ అనంతరం పోలీసు యంత్రాంగం స్పందించింది. గ్రామ సర్పంచ్ కు సమాచారం ఇచ్చి, పంచాయతీ సిబ్బందితో కలిసి పెద్దమ్మ గుడి వద్ద ఉన్న బతుకమ్మను గౌరవప్రదంగా నిమజ్జనం చేయించి, తాంబాలాన్ని బాధితుల ఇంటికి అందజేశారు. సీఐ, ఎమ్మార్వో విచారణ: అనంతరం తిమ్మాపూర్ సీఐ అనిల్ కుమార్, గన్నేరువరం ఎమ్మార్వో ఇప్ప నరేందర్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీఐ అనిల్ కుమార్ శాంతిభద్రతలు కాపాడాలని, కుల బహిష్కరణ చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. ఎమ్మార్వో ఇప్ప నరేందర్ ఇరువర్గాలకు సర్దిచెప్పి ఐక్యంగా ఉండాలని సూచించారు.





## ఒకప్పుడు తాగునీటికి ఆధారం..
# నేడు కాలుష్య కోరల్లో..

**11 గ్రామాలకు సాగు, తాగునీటి ఆధారం టెక్రియాల్ చెరువు**

- నిమజ్జనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం
- ప్లాస్టిక్ తిని పశువులు మృత్యువాత
- సుందరీకరణ కంటే పరిరక్షణే ముఖ్యం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి):**

*ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచిస్తున్నప్పటికీ, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ చెరువు మాత్రం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు 11 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఆధారంగా నిలుస్తోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ప్రజల దాహార్తిని తీర్చిన చెరువు నేడు మురికి, ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.*



**నిమజ్జనాలతో నీటి కాలుష్యం.. పశువులకు ప్రాణగండం**

సుమారు 25 ఏళ్ల క్రితం చెరువు కట్టపై ఉన్న దర్గా వద్ద పండుగలు నిర్వహించినప్పుడు భక్తులు చెరువు నీటితో వంటలు చేసుకొని, తాగేవారని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం వినాయక, దుర్గామాత విగ్రహాల నిమజ్జనాలతో పాటు ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు నీటిలో చేరుతుండటంతో కాలుష్య సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాల తయారీలో ఉపయోగించే రసాయన రంగులు, ఇతర సామగ్రి నీటి నాణ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పండుగలకు ఎవరూ వ్యతిరేకం కాదని, పర్యావరణానికి హాని కలగకుండా నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.
మరోవైపు చెరువు పరిసరాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పశువులకు ముప్పుగా మారుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్లాస్టిక్ తినడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు. చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాలు పడేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**సుందరీకరణ కంటే పరిరక్షణే ముఖ్యం**

400 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువును సుందరీకరించి అభివృద్ధి చేయాలనే ఆలోచన కంటే ముందుగా దాని ఉనికిని, నీటి నాణ్యతను కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులోని నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని, కాలుష్యానికి కారణాలను గుర్తించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. చెరువు కట్ట, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.
నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి చెరువు పరిరక్షణకు కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే నిమజ్జనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. 11 గ్రామాల ప్రజల జీవనాధారమైన టెక్రియాల్ చెరువును భవిష్యత్తు తరాలకు అందించాలంటే శాశ్వత పరిరక్షణ చర్యలు చేపట్టాలని, ముందు చెరువును కాపాడి.. ఆ తర్వాతే సుందరీకరణ పనులు చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

# 88 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి దోపిడీ.. నిందితుడి అరెస్ట్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22( జనం సాక్షి) :** మాచారెడ్డి మండలంలో 88 ఏళ్ల వృద్ధురాలిని బెదిరించి, దాడి చేసి ఆభరణాలు, నగదు దోపిడీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్జనాయక్ తండాకు చెందిన ఆగుళ్ళ ఈరమ్మను చెట్టు కొమ్మ చూపిస్తానని నమ్మించి ఆటోలో ఎక్కించుకున్న నిందితుడు చుక్కాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి ఆమె వద్ద ఉన్న వెండి కడియాలు, బంగారు ముక్కుపుడక, నగదును లాక్కొని పరారయ్యాడు.
బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మాచారెడ్డి పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. 22న నిందితుడు ఆలకుంట అలియాస్ దండుగుల సాయులు (34)ను అదుపులోకి తీసుకుని విచారించగా, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేసినట్లు వెల్లడైంది. నిందితుడి నుంచి నాలుగు వెండి కడియాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో రూరల్ సీఐ శ్రీధర్, మాచారెడ్డి ఎస్ఐ కె. విజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కేసును ఛేదించాయి. నిందితుడిని త్వరితగతిన పట్టుకున్న ఎస్ఐ విజయ్‌తో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.





# అందరు సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ హోంమంత్రి సబితాఇంద్రారెడ్డి
- సబితారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన మండల బీఆర్ఎస్ నాయకులు

**మొయినాబాద్,జనంసాక్షి:** ప్రజలు ఆయురారోగ్యాలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు మాజీ హోంమంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అఖిత భారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు రవియాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని సబితారెడ్డి నివాసంలో ఆమెను కలిసి నాయకులతో దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా సబితారెడ్డికి మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి పూలబోకేతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరా పండుగ అందరు కలిసి సంతోషంగా జరువుకోవా లన్నారు. సుఖసంతోషాలు ఉండాలంటే అందరి కలయిక, కలుసుకోవడం ఎంతో ప్రాముఖ్యమని సూచించారు.నేడు ప్రపంచ దేశాలలో దసరా పండుగను తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో బతుకమ్మలు, దసరా పండుగను నిర్వహించుకోవడం ఆనందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ప్రవీణ్ రెడ్డి రాజేందర్ రెడ్డి మండల నాయకులు రవియాదవ్, సురేందర్ గౌడ్, అమ్డాపూర్ సర్పంచ్ మధ్యపాగ కృష్ణ, జితేందర్ రెడ్డి సాయిపాల్ రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీహరియాదవ్, రేనెట్లా సుధాకర్ గౌడ్ నాయకులు, పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలి

**కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఉద్యోగ సంఘం వినతి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీఎన్జీవోస్ కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బి.రవిప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణతోపాటు వారి సమస్యల పరిష్కారానికి జిల్లా కార్యాలయం అవసరమని వివరించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు వెల్లడించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బి.భరత్ కుమార్, కోశాధికారి శేష సాయి గిరికాంత్, కలెక్టరేట్ యూనిట్ కార్యదర్శి లింగాల అక్షయ్ కుమార్, కోశాధికారి ఉమాకాంత్, కార్యవర్గ సభ్యులు శివ, వెంకట్ రెడ్డి, అలాగే గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ స్టేట్ ఫోరం సీనియర్ నాయకులు అంజయ్య, ట్రెజరీ శాఖకు చెందిన నందు లాల్, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 అక్టోబర్ 2026

# అలయ్ బలయ్ తెలంగాణ ఆత్మ, జీవన విలువల ప్రతీక

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** అలయ్ బలయ్ ఒక సాంప్రదాయ సమావేశం కాదని, ఇదొక తెలంగాణ ఆత్మ, జీవన విలువల ప్రతీక అని తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. దసరా పండుగ అయిపోయిన తర్వాత అందరూ మళ్ళీ ఒకసారి కలుసుకోవడానికి, ఆప్యాయతను పంచుకోవ డానికి ఏర్పాటు చేసిన గొప్ప వేదిక అలయ్ బలయ్ అని చెప్పారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురువారం రోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఘన స్వాగతం పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తాత్రేయ అజాత శత్రువు అని, ఆయనకు పార్టీలకు అతీతంగా స్నేహాభిలాషులు, మిత్రులు ఉన్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చెప్పారు. దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మీ ఈ బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

# గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలని, ఆ దిశగా బూత్ స్థాయి నుంచే పక్కా ప్రణాళిక రూపొందించుకుని, పాత-కొత్త నేతలంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. శంషాబాద్ మల్లికా గార్డెన్స్ లో గురువారం నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వోద్యోగాల భర్తీ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను బలంగా ఎదుర్కొంటూనే... వారి వైఫల్యాలను పట్టభద్రుల ముందు ఎండగట్టాలన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా గట్టిగా తిప్పికొట్టాలన్నారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా ప్రత్యేక ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని శ్రేణులకు సూచించారు. బూత్ స్థాయి నుంచి ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, ప్రచారంలో అత్యుత్తమంగా పనిచేసే కార్యకర్తలకు, నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్ మధు యాష్కీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు పారిజాత నర్సింహారెడ్డి, వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ అండాల అక్రమ రవాణా

- ముంబైలో ముఠా గుట్టురట్టు
- ఈడీ దాడుల్లో భారీగా నగదు, ఆస్తులు సీజ్

**ముంబై (జనంసాక్షి) :** మానవ అండాలు అక్రమ రవాణా చేస్తున్న ముఠాపై ముంబైకి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు చేశారు. భారీగా నగదు, బ్యాంకు లాకర్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు సహా కీలక ఆధారాల్ని అధికారులు సీజ్ చేశారు. మంజూషా వాంఖెడేకు సంబంధించి లభ్యమైన ఆధారాలను బట్టి మానవ అండాల అక్రమ రవాణా ముఠా గుట్టును ఈడీ ముంబై జోనల్ ఆఫీస్ అధికారులు ఛేదించారు. ఈ అక్రమ రవాణాలో మొత్తం 17 మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. దీనిలో భాగంగా అక్టోబర్ 16 నుంచి పది వేర్వేరు చోట్ల సోదాలు నిర్వహించారు. థానే, నాసిక్, బరామతితోపాటు ఇతర చోట్ల దాడి చేశారు. థానేలోని బద్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈ కేసును విచారిస్తున్నారు. మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ)-2002 కింద ఈ కేసు నమోదైంది. పలు ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్లలో సోదాలు జరిపారు. నిందితులు, వారి స్థావరాల నుంచి రూ.29 లక్షల నగదు, బ్యాంకు అకౌంట్లు, ఇతర డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాల్ని సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఈ నెట్‌వర్క్ సభ్యులు పేద మహిళల్ని లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. వారికి కొంత నగదు ఇచ్చి, వారి అండాలను సేకరిస్తున్నారు. అనంతరం వాటిని ఐవీఎఫ్ సెంటర్లు, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) బ్యాంకులకు విక్రయిస్తున్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరం. అలాగే, తప్పుడు ధృవపత్రాలతో డోనర్ల వివరాలు నమోదు చేస్తున్నారు. ఒకసారి డొనేట్ చేసిన మహిళల నుంచే వరుసగా అండాల్ని సేకరిస్తూ, వేరే పేర్లతో విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 40 మందికి పైగా మహిళల నుంచి ఇలా అండాల్ని సేకరించారు. ఒక్కో సైకిల్‌కు రూ.25,000 నుంచి రూ.30,000 వరకు మహిళలకు అందిస్తున్నారు. అలాగే, అండాలు విడుదలయ్యేందుకు వారికి హార్మోనల్ ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు బయటపడింది. దీంతో ఈడీ రంగంలోకి దిగి విచారణ జరుపుతోంది.

# భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అరుదైన అవార్డు దక్కింది. బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా కాలేదు. అప్పుడే పాలనలో తనదైన ముద్ర వేసే దిశగా అడుగులు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, జిల్లాలోని కీలక అంశాలపై దృష్టి సారించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యా సంస్థలు సామాన్య ప్రజలకు కీలకమైన సేవా కేంద్రాలు. వీటిలో సేవల నాణ్యత, సిబ్బంది బాధ్యతాయుత పనితీరు మెరుగుపడాలన్న దిశగా కలెక్టర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులు వాటిపై స్పందించేలా చూడటం పాలనలో కీలకమైన అంశంగా నిలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూ సర్వే కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు. భూములకు సంబంధించిన వివాదాలు, రెవెన్యూ వ్యవహారాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలు కావడంతో వాటి పరిష్కారంలో సంబంధిత శాఖల సమన్వయానికి ప్రాధాన్యమిస్తున్నారు. రెవెన్యూ, అటవీ భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అర్జీలను పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవడంపై కలెక్టర్ దృష్టి సారిస్తున్నారు. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారానికి శాఖల వారీగా చర్యలు చేపట్టడం ప్రజాకేంద్రిత పాలనలో కీలకం కావడం ఆయన పనితీరుకు దర్పణం పడుతుంది.

# త్వరలో సిరిసిల్లలో జానపద జాతర

- కేటీఆర్‌ను ఆహ్వానించిన కళాకారులు



**సిరిసిల్ల (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కళాకారుల ఆటపాటలతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో త్వరలో సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సిరిసిల్లలో నిర్వహించనున్న జానపద జాతర కార్యక్రమానికి తన సహకారం అందిస్తానని, కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జానపద జాతర నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొనే ఈ కార్యక్రమం తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్, ప్రధాన కార్యదర్శి ఎండీ సత్తర్, జడల రమేష్, గజ్వేల్ వేణు, వస్పారి కిరణ్, మద్దెల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# నార్లాపూర్ నుంచి నీళ్లు తరలించే మార్గం చూపిస్తున్నాం.. అమలు చేయండి!

- తుండు కట్ట తొలగిస్తే గ్రావిటీ ద్వారా ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లకు నీళ్లు తరలించవచ్చు
- ప్రభుత్వం జీఓ ఇచ్చి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు ఇవ్వాలి..
- దగ్గరుండి పనులు పూర్తి చేసి రిజర్వాయర్లు నింపి చూపిస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్‌కు ప్రతి సవాల్..
- నార్లాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**వనపర్తి రూరల్ అక్టోబర్ 22 (జనంసాక్షి) :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లకు నీటిని ఎలా తరలించాలో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్వీకరించారు. నార్లపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి కుడికిళ్ల సమీపంలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తుండు కట్టను పరిశీలించారు. సాంకేతిక అంశాలను వివరించి, తుండు కట్టలో కొంత భాగాన్ని తొలగిస్తే గ్రావిటీ ద్వారా ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లకు నీటిని తరలించే అవకాశం ఉందని ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి జూపల్లి కృష్ణారావు వెటకారపు మాటలు పక్కనపెట్టి, రైతులకు నీళ్లెలా అందించాలనే దానిపై దృష్టి సారించాలని హితవు పలికారు. తుండు కట్టను తొలగించి నీటిని దిగువ రిజర్వాయర్లకు తరలించే పనులను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా జీఓ జారీ చేసి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు ఇస్తే, తామే దగ్గరుండి పనులు పూర్తి చేసి నార్లపూర్ నుంచి నీటిని తరలించి రిజర్వాయర్లను నింపి చూపిస్తామని సవాల్ విసిరారు. ప్రస్తుతం నార్లపూర్ పంప్‌హౌస్‌లో పది పంపులు ఒకేసారి పనిచేస్తే ఈ కాలువ ద్వారా సుమారు 26 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే అవకాశం ఉందని, ప్రస్తుతం రెండు పంపులు మాత్రమే నడుస్తున్నందున తుండు కట్టలో పావు భాగం మట్టిని తొలగించినా గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని ఆయన వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సాంకేతికంగా పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మూడేళ్లుగా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోందని, ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 27 వేల ఎకరాల భూసేకరణ చేపట్టి, రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 70 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లను సిద్ధం చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేసిన పనులను ముందుకు తీసుకెళ్లకుండా, కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పక్కనపెట్టారని ఆరోపించారు. జూరాల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టులోకి 245 టీఎంసీల నీరు చేరినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 100 టీఎంసీలకు పైగా నీరు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం తరలిపోయిందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం శ్రీశైలంలో 60 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అందులో 20 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే వానాకాలం పంటలను కాపాడటంతోపాటు భూగర్భ జలాలను పెంచి ప్రజల నీటి అవసరాలను తీర్చవచ్చని పేర్కొన్నారు. జిల్లా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తుండు కట్ట తొలగింపు పనులను వెంటనే చేపట్టి, నీటిని రిజర్వాయర్లకు తరలించాలని డిమాండ్ చేశారు. రైతులకు నీళ్లు అందించే విషయంలో రాజకీయ విమర్శలకు కాకుండా ఆచరణాత్మక పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, లక్ష్మారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నందిమల్ల అశోక్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి వాకిటి మానవత్వం

**కృష్ణ, అక్టోబర్ 22 (జనం సాక్షి):** కున్సీ గ్రామానికి చెందిన పల్లె రమేష్ గుండె ఆపరేషన్ కోసం రూ.4 లక్షల లోక్ చెక్కును మంత్రి వాకిటి శ్రీహరి బాధితునికి అందజేశారు. ఆపదలో అండగా ఉంటానంటూ మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ముఖ్యంగా మక్తల్ నియోజకవర్గ ఏ గ్రామంలో అయినా ప్రజలకు కష్టం వచ్చిందంటే మనిషికి ఏదో విధంగా సాయం చేయాలనేదే తన ఉద్దేశమని, ఏ ఒక్క మనిషికి కూడా వైద్యం విషయంలో కష్టమనేది వచ్చిందంటే తాను ముందుండి సహకరిస్తానని హామీ హామీ ఇచ్చారు.

# జవహర్ నగర్‌లో అక్రమ కట్టడాలు కూల్చివేత




**కాప్రా (జనంసాక్షి) :** కాప్రా మండల పరిధి జవహర్ నగర్‌లోని సర్కారు భూముల్లో అక్రమ నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో కూల్చివేశారు. వికలాంగుల కాలనీలో రెండు రూములు, బీరప్ప గడ్డలో రెండు రూములు, సేవా లాల్ తండాలో రూములు, లక్ష్మీ నరసింహ కాలనీలో ఒక రూంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ జవహర్ నగర్ లోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, కబ్జాదారులు కట్టడాలు చేస్తూ సహించేదే లేదని హెచ్చరించారు. సర్కారు భూములను అమాయక పేదలకు అమ్ముతు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నజర్ పెట్టామని, త్వరలోనే చర్యలు తీసుకుం టామని అన్నారు. ప్రభుత్వ భూముల రక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జవహర్ నగర్ ప్రాంతంలోని భూముల్లో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదని హెచ్చరించారు.

# కొమురం భీం ఆశయాలను కాపాడుకోవాలి

- ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీం: మంత్రి సీతక్క





**దుమ్ముగూడెం (జనంసాక్షి) :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, "జల్, జంగల్, జమీన్" నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కొమురం భీం అని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో గురువారం నాడు నిర్వహించిన కొమురం భీం విగ్రహావిష్కరణ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు సహా పెద్ద సంఖ్యలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సమాజానికి కొమురం భీం ఒక దిక్సూచి అని, ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కొమురం భీం, బిర్సా ముండా, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు తమ పోరాటాలతో సమాజంలో మార్పునకు బాటలు వేశారని సీతక్క అన్నారు. వారు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అణగారిన వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు అందాయని పేర్కొన్నారు. అలాంటి మహనీయులను మన హృదయాల్లో నిలుపుకొని, వారి ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఇతర సామాజిక వర్గాలతో కలిసిమెలిసి జీవిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని మంత్రి అన్నారు. ఆదివాసీ పోరాటాలు దేశ చరిత్రలో కీలకమైనవని, అణచివేతకు వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటాలు హక్కుల సాధనకు మార్గం చూపాయని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీతక్క అన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఐక్యంగా పరిష్కారాలు సాధించుకోవాలని సూచించారు. పరస్పర సహకారం, ఐక్యతతోనే ఆదివాసీ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కొమురం భీం విగ్రహావిష్కరణకు ఆదివాసీ సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిస్తూ జై కొమురం భీ అని నినదించారు.

# నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలి

- వరంగల్ సీపీ ఎన్. శ్వేత



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ బుధవారం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శుభూర్‌కు పలు కీలక సూచనలు చేస్తూ, పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో వరంగల్ ఇన్‌చార్జి ఏసీపీ నర్సింహారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువకుడి హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

- మెదక్ కోర్టు తీర్పు

**మెదక్ (జనంసాక్షి) :** పాత కక్షల నేపథ్యంలో యువకుడిని హత్య చేసిన కేసులో ఏడుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, గురువారం వెల్లడించారు. కేసులో పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన జెల్లా రాజారామ్ గౌడ్, యాదరం నాగరాజు గౌడ్ కుటుంబాల మధ్య పాత కక్షల కారణంగా తరచూ ఘర్షణలు చోటుచేసుకునేవి. ఈ నేపథ్యంలో 2020 మే 20న ఉదయం 6.30 గంటల సమయంలో రాజారామ్ గౌడ్ కుమారుడు నర్సింలు గౌడ్ (28) గ్రామ శివారులోని బీడు భూమిలో తీవ్ర గాయాలతో కనిపించాడు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370